సామాన్యుల గొంతుక - సకల జనుల వేదిక

# జనగణమన

దినపత్రిక

బుధవారం 01-07-2026 హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 62
Circulated in Telangana & Andhra Pradesh


వెల : రూ.5.00 పేజీలు : 08
www.janaganamanadaily.com

సంబరాల జీవితం సాభాగ్యాల సౌరభం
KAPIL GROUP
Creating Value Cultivating Trust
కపిల్ చిట్స్
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం
sricharanamedia.in

# కేసీఆర్ తెచ్చింది తాగుడు కల్చర్..

## సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**జనగణమన బ్యూరో హైదరాబాద్:**
వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా తమ ప్రభుత్వం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందించే రైతుభరోసా ఆర్థికసాయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శిల్పాకళా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ మేరకు తొలిరోజు 41.37 లక్షల మంది రైతుల ఖాతాలోకి





రూ.2482.02 కోట్లు జమ అయ్యాయి. ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతుల కోసం రూ.878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72లక్షల మంది రైతుల కోసం రూ.1,603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో సాగు పనులు (మిగతా 3 లో..)

# జూలై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

**జనగణమన బ్యూరో హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) అత్యవసర సమావేశం ఫిక్స్ అయింది. జూలై 2వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 3:00 గంటలకు ముఖ్యమంత్రి అధ్యక్ష తన ఈ కీలక భేటీ నిర్వ హించ నున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయం 6వ అంతస్తులో గల కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. (మిగతా 3 లో..)

# 2022 నాటి కేసులో రాజాసింగ్ నిర్దోషిగా విడుదల..

## MIM, BRSలపై సెన్సేషనల్ కామెంట్స్



**జనగణమన బ్యూరో హైదరాబాద్:**
నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, పోలీసులు ఎంఐఎం పార్టీ ఒత్తిడికి తలొగ్గి తనపై పీడీ యాక్ట్ ప్రయోగించారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. మతాధినేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నమోదైన కేసులో మంగళవారం ఆయన నాంపల్లి కోర్టు నుంచి నిర్దోషిగా విడుదలయ్యారు. కేసులో తీర్పు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంఐఎం పార్టీ చెప్పిన విధంగా తనపై తప్పుడు కేసులు బనాయించారని ఫైర్ అయ్యారు. 2022లో ఎవరో దేవుడిపై తాను వ్యాఖ్యలు చేశానంటూ తనపై అన్యాయంగా కేసు నమోదు చేశారని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వం, పోలీసులు ఎంఐఎం పార్టీ ఒత్తిడికి లొంగిపోయి తనపై పీడీ యాక్ట్ ప్రయోగించారని ధ్వజమెత్తారు. దాదాపు 77 రోజుల పాటు తనను జైల్లో పెట్టారని గుర్తు చేశారు. నాటి ప్రభుత్వం కథను పూర్తిగా మార్చేసి, వేర్వేరు పోలీస్ స్టేషన్లలో తనపై కావాలనే తప్పుడు కేసులు నమోదు చేయించిందని రాజాసింగ్ మండిపడ్డారు.

# తెలంగాణ భవిష్యత్తు బీజేపీదే

## బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నితిన్ నబీన్

**జనగణమన ప్రతినిధి :నల్గొండ:**



తెలంగాణ భవిష్యత్తు బీజేపీదేనని, రాష్ట్రంలో మార్పు తీసుకురావాలంటే ప్రజల గొంతుకగా మారాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నితిన్ నబీన్ అన్నారు. మంగళవారం ఘట్కేసర్ సర్కిల్ అంక్షాపూర్‌లోని రాక్ గార్డెన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ప్రజలు కన్న కలలను సాకారం చేసే దిశగా బీజేపీ పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. 1980లో స్థాపితమైన భారతీయ జనతా పార్టీ తొలిసారి ఎన్నికల్లో విజయం సాధించడంలో కార్యకర్తల కృషే ప్రధాన కారణమని అన్నారు. ఒకప్పుడు ఇద్దరు పార్లమెంట్ సభ్యులతో ప్రారంభమైన పార్టీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని చెప్పారు. దీనికి బూత్ స్థాయి కార్యకర్తల కఠోర శ్రమే కారణమని పేర్కొన్నారు. (మిగతా 3 లో..)




# భారతీయ కళ, సంస్కృతిని భావితరాలకు అందించాలి..: మంత్రి జూపల్లి కృష్ణారావు

(మిగతా 3 లో..)

# ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్‌క్వార్టర్‌గా హైదరాబాద్..

## సీఎం రేవంత్ రెడ్డితో భేటీలో సునీల్ మిట్టల్

**జనగణమన బ్యూరో హైదరాబాద్:**



హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, AI కార్యకలాపాలపైన దృష్టి పెట్టాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్?కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్?డీ బోధీ పెవిలియన్‌లో సునీల్ భారతి మిట్టల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణలో చేపట్టిన అనేక కార్యక్రమాలు, సంస్కరణలను వివరిస్తూ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేకంగా విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేస్తున్న తీరును వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అధునాతన సాంకేతిక విధానాలతో ఏటీసీలుగా మార్చిన విషయాలను తెలిపారు. ఇదే కోవలో పాలిటెక్నిక్ కాలేజీల అధునికీకరణ గురించి చెప్పారు.

**వీలైనంత తొందరగా చందన్ వెల్లి డేటా సెంటర్:**
చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత తొందరగా ప్రారంభించాలని, తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, AI మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. రాష్ట్రంలో భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# మీ ద్రోహాన్ని మరిచిపోతారని అనుకోవడం అవివేకమే..

## రైతు భరోసా నిధుల విడుదల వేళ కేటీఆర్ విమర్శలు




**జనగణమన బ్యూరో హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వం రాష్ట్ర రైతులకు పెద్ద ఎత్తున రైతుభరోసా నిధులు బాకీ పడిందని, గడిచిన 30 నెలల పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిందే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులకు బకాయి పడిన రైతు భరోసా నిధులు, కాంగ్రెస్ ప్రభుత్వ ఎగవేతలపై మంగళవారం ఆయన స్పందించారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా అని నిలదీశారు.

**శాపంలా వెంటాడటం ఖాయం..**
కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే రేవంత్ రెడ్డి పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే అవుతుందన్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి 15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీచేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలన్నారు. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం అని హెచ్చరించారు.

**అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు..**
ఇప్పటికే 50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారని, (మిగతా 3 లో..)

# యాదగిరిగుట్టలో గెస్ట్ హౌస్‌లకు తిరుమల మోడల్..

## సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు




**జనగణమన బ్యూరోహైదరాబాద్:**
యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి కోసం భూముల కేటాయింపుల విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఏ ప్రాతిపదికన స్థలాలు ఇచ్చినా సదరు భూమి యాజమాన్యపు హక్కులు మాత్రం పూర్తిగా టెంపుల్ బోర్డు వద్దే ఉండాలని అధికారులకు తేల్చిచెప్పారు. యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధిపై ఎంసీఆర్?హెచ్?ఆర్?డి బోధి పెవిలియన్?లో మంగళవారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. యాదగిరి గుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ కోసం మార్కెట్ రేట్ ప్రకారం భూమి కేటాయించాలని ఆదేశించారు. వివిధ మఠాలకు భూముల కేటాయింపు పైన ఒక విధానం రూపొందించాలన్నారు. కుల సంఘాలకు స్థలం కేటాయింపు పైన స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం తయారుచేయాలన్నారు.
(మిగతా 3 లో..)

# అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అంబేద్కర్ నగర్ బస్తీవాసుల అవస్థలు

**డ్రైనేజీ సమస్యతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు --**

**కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్న రహదారి**




జవహర్ నగర్, జూన్ 30 జనగణమన ప్రతినిధి కీసర సర్కిల్ జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బస్తీవాసులు తీవ్ర పారిశుధ్య సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది.ప్రతిరోజూ మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డు మొత్తం బురదమయంగా మారి నడవలేని పరిస్థితి ఏర్పడుతోందని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, ఉద్యోగులు ప్రతిరోజూ ఈ సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.ఒక వైపు ఉన్న ఇళ్లను 4వ డివిజన్ పరిధికి చెందినవిగా, మరో వైపు ఉన్న ఇళ్లను 5వ డివిజన్ పరిధికి చెందినవిగా పేర్కొంటూ ప్రజాప్రతినిధులు బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టివేస్తున్నారని బస్తీవాసులు వాపోతున్నారు. దీంతో అంబేద్కర్ నగర్ అంటేనే పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రాంతంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్తులో మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరారు.

# ఓటు హక్కు పరిరక్షణకు ఎస్ఐఆర్ సర్వేలో పాల్గొనాలి

**రాగిడి లక్ష్మారెడ్డి**




జవహర్‌నగర్ జూన్ 30జనగణమన ప్రతినిధి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జవహర్‌నగర్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జవహర్‌నగర్‌లో 579, 587 బూత్ ఇన్‌చార్జులు కూటికంటి వెంకటేశ్వర్లు, బురుగు కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ఫారాన్ని నింపి ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఓటరు జాబితా సవరణ ద్వారా అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించబడుతుందని, ఎలాంటి లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు చైతన్యంతో ముందుకు వచ్చి సర్వే ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించారు.



కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగం బాలరాజ్, సుధాకర్ చారి, సిద్ధులు యాదవ్, మహేష్, వెంకట నర్సయ్య,మురళి సోమయ్య, సాయికుమార్, అశోక్‌తో మహిళా నాయకులు మహేశ్వరి, ధనలక్ష్మి, విమల, సిస్టర్ యాకమ్మ, మల్లమ్మ , బస్తీవాసులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన గట్టు రాజన్నకు ఘన సన్మానం -- వీడ్కోలు సభ

**దేవస్థాన అభివృద్ధికి విశేష సేవలు అందించిన అధికారి అని ప్రశంసలు**




కీసర, జూన్ 30 జనగణమన ప్రతినిధి శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో సేవలందించిన గట్టు రాజన్న గ్రేడ్--ఐ కార్యనిర్వాహణాధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా దేవాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, గట్టు రాజన్న దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో, ఆలయ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం సహచర ఉద్యోగులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేవాలయంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ సంపాదించిన అనుభవం, ప్రజలతో మమేకమయ్యే తీరు, బాధ్యతాయుతమైన సేవల కారణంగానే ఆయనకు ఈ పదోన్నతి లభించిందని అభినందించారు. కొత్త బాధ్యతల్లోనూ మరింత విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ తటాకం వెంకటేష్, కార్యనిర్వాహణాధికారి కట్ట సుధాకర్ రెడ్డి, వేదపండితులు సత్యనారాయణ శర్మ, గణేష్ తివారి, అర్చకులు రవిశర్మ, వీరేష్ శర్మ, రవికాంత్ శర్మ, రమేష్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ వెంకట్రావు, రిటైర్డ్ ఈఓ రామారావు తదితరులు పాల్గొని గట్టు రాజన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

# పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఘన సన్మానం

**"ప్రజలకు చేసిన సేవే అసలైన సంపద" -- జిల్లా కలెక్టర్ మను చౌదరి**

మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ జూన్ 30జనగణమన ప్రతినిధి ప్రభుత్వ విధుల్లో భాగంగా ప్రజలకు నేరుగా సేవలందిస్తూ, వారికి అవసరమైన సమాచారం, సహాయం అందిస్తే వారు జీవితాంతం గుర్తుంచుకుంటారని, అదే ఉద్యోగ జీవితంలో నిజమైన సంపద అని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు.హౌజింగ్ పీడీ రమణమూర్తి, కలెక్టర్ సీసీ బాల భాస్కర్, హౌజింగ్ ఏఈ సుభాష్ రెడ్డి, కలెక్టరేట్ ఆఫీస్ సబార్డినేట్ జర్మియాజ్‌ల పదవీ విరమణ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ప్రజలకు చేయగలిగినంత మంచి చేయాలని సూచించారు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్లకు సంబంధించి 30 నుంచి 40 వేల వరకు దరఖాస్తులు వచ్చినప్పటికీ, హౌజింగ్ పీడీ రమణమూర్తి ఎంతో ఓర్పుతో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించేందుకు విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు.




పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.నాలుగు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ సేవలో ఉన్న రమణమూర్తి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సమయాన్ని గడుపుతూ, తమ అభిరుచులకు అనుగుణంగా జీవితాన్ని ఆనందంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.కలెక్టరేట్ సీసీ బాల భాస్కర్ సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించిన కలెక్టర్, అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ఎంతో ఓపికతో సందర్శకులను సమన్వయం చేస్తూ విధులు నిర్వహించారని కొనియాడారు. తనతో పనిచేసిన సీసీలలో భాస్కర్ అత్యుత్తమంగా సేవలందించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులను కలెక్టర్ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా సౌకర్యాలు, పౌష్టికాహారం అందించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**జూలూరుపాడు పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**మధ్యాహ్న భోజన నాణ్యతపై అసంతృప్తి.. లోపాలు పునరావృతమైతే కఠిన చర్యలు!**





జూలూరుపాడు, జులై 1 జనగణమన ప్రతినిధి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం కల్పించడం అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (KGBV) మరియు కళాశాల, అలాగే జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని వసతులు, విద్యా ప్రమాణాలు, భోజన నాణ్యతను ఆయన స్వయంగా పరిశీలించారు.?భద్రత, తాగునీటిపై ప్రత్యేక నిఘా,?కలెక్టర్ ముందుగా కేజీబీవీ పాఠశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. 7, 8 తరగతుల విద్యార్థినులతో ముచ్చటించి విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల ఔటింగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన ఆయన, బాలికలను కేవలం తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయటకు పంపాలని ఉపాధ్యాయులను కఠినంగా ఆదేశించారు. పాఠశాలలోని సీసీ కెమెరాల పనితీరును, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అలాగే, పాఠశాలలోని ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మతులు ఆలస్యమవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే వాటిని పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు.



**మధ్యాహ్న భోజన నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు!**

అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థుల సంఖ్య మరియు హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా పప్పు పలుచగా ఉండటంతో పాటు నాణ్యత లోపించడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో ఉండాలని సూచించారు."నేను మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేస్తాను. ఆహార నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు" అని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా లేదా అని కూడా ఆయన ఆరా తీశారు.అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం,ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం కలిగేలా విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మెరుగుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో గుర్తించిన లోపాలను సంబంధిత అధికారులు వెంటనే సరిదిద్దాలని స్పష్టం చేశారు.ఈ ఆకస్మిక తనిఖీ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి, ఎంఈఓ జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా నిలవాలి.. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి!

**అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట 'ఏఐయూకేఎస్' మహాధర్నా**

**నకిలీ విత్తనాలను అరికట్టాలి.. 'రైతు భరోసా' వెంటనే విడుదల చేయాలి**

**పోడు సాగుదారులకు రీ-సర్వే చేసి పట్టాలివ్వాలని డిమాండ్**




అశ్వారావుపేట, జులై 1 జనగణమన ప్రతినిధి తొలకరి వర్షాలు మొదలైన వేళ అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే సబ్సిడీ ధరలకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సరఫరా చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) డిమాండ్ చేసింది. యూరియా పంపిణీలో రైతులను ఇబ్బంది పెడుతున్న ఆన్‌లైన్ యాప్ నిబంధనలను తక్షణమే తొలగించి, పాత పద్ధతిలోనే సరఫరాను పునరుద్ధరించాలని కోరింది. అశ్వారావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో రైతులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించారు.ఈ ధర్నా కార్యక్రమానికి గొంది లక్ష్మణ్‌రావు అధ్యక్షత వహించగా, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏపీకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు గోకినపల్లి ప్రభాకర్, ఏఐయూకేఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కంగాల కల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

**ఆన్‌లైన్ యాప్ నిబంధనలు తొలగించాలి:**

"యూరియా కొనుగోలు కోసం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ యాప్ విధానం వల్ల సాధారణ రైతులకు ఎరువులు సకాలంలో అందడం లేదు. సాంకేతిక ఇబ్బందుల వల్ల రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కాబట్టి యాప్‌లతో సంబంధం లేకుండా గతంలో ఉన్న పద్ధతిలోనే రైతులకు సులభంగా యూరియా అందుబాటులోకి తీసుకురావాలి'' అని నాయకులు డిమాండ్ చేశారు.రైతు సంఘాల ప్రధాన డిమాండ్లు ఇవే..నకిలీల నియంత్రణ: మార్కెట్లోకి వస్తున్న నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టి, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలి.ఆర్థిక చేయూత: సాగు పెట్టుబడికి అత్యంత కీలకమైన 'రైతు భరోసా' నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.పోడు భూముల సమస్య: పోడు భూములకు సంబంధించి ఇప్పటికే సర్వే జరిగినప్పటికీ, ఇంకా పట్టా పాసుబుక్కులు రాని సాగుదారుల కోసం వెంటనే రీ-సర్వే నిర్వహించి హక్కు పత్రాలు (పట్టాలు) అందించాలి.ఉద్యమం తప్పదు - నాయకుల హెచ్చరిక:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండివైఖరి వీడి రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు సంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, రైతాంగం:ఈ నిరసన కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) మండల నాయకులు కంగాల కన్నయ్య, కారం రాజులు, ధర్మముల రాంబాబు, సున్నం రామారావు, మడకం ముత్యాలరావు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, పార్టీ మండల నాయకులు కంగాల భూలక్ష్మి, ధర్మల శ్రీరాములు, రైతులు సోడెం పాల్‌రాజు, తెల్లం సత్యం, సోడెం లక్ష్ముడు, కణితి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ తెచ్చింది తాగుడు కల్చర్..

(మొదటి పేజీ తరువాయి)

మొదలయ్యే నాటికే రైతుభరోసాను అందిస్తున్నామని అన్నారు. గత 30 నెలలుగా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారని, 19 మంది సీఎంలు చేసిన అప్పు రూ. 60వేల కోట్లు మాత్రమేనని అన్నారు. కానీ తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ. 8.11 లక్షల కోట్లు అయిందని పేర్కొన్నారు. రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలో మునిగిన తెలంగాణ రాష్ట్రాన్ని తనకు అప్పగించారని రేవంత్ రెడ్డి అన్నారు.

**బడి పిల్లల బిల్లులు కూడా పెండింగే..**

ఎన్నికల ముందు రాష్ట్రంపై రూ. 6 లక్షల కోట్ల అప్పు ఉంటుందని భావించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక లెక్కలు తీస్తే.. గుట్ల కొద్దీ అప్పులు బయటపడ్డాయని కామెంట్ చేశారు. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్‌లకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. కొన్నేళ్లుగా జీతాలు వాయిదా పద్ధతిలో వస్తున్నాయని అధికారులే తమ వద్ద మొర పెట్టుకున్నారని గుర్తు చేశారు. బడి పిల్ల తిండి బిల్లులు కూడా వేల కోట్లు బకాయిలు పెట్టి పోయారని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన ఫైర్ అయ్యారు. సర్పంచ్‌లకు వేల కోట్లు పెండింగ్ పెట్టిపోతే ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. బద్నాం మోసింది తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పులతో ఢిల్లీలో కూడా పరువుపోయే పరిస్థితి ఉందన్నారు.

**అప్పులు చేసి ఫామ్‌హౌస్‌లో పండలే..**

నేను తప్పులు చేసి ఫామ్‌హౌస్‌లో పడుకుని.. తప్పించుకు తిరగట్లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పులు తీరుస్తూ.. ప్రజల మధ్యే ధైర్యంగా తిరుగుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ. 2లక్షల లోపు రుణాలన్నీ మాఫీ చేశామని అన్నారు. రుణ మాఫీ కింద ఆరు నెలల్లోనే రైతుల ఖాతాల్లో రూ. 22,600 కోట్లు జమ చేశామని తెలిపారు. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని దుష్ప్రచారం చేశారని, సాగుకు ఉచిత కరెంట్ అనేది కాంగ్రెస్ పేటెంట్ హక్కని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**వేల కోట్ల కమీషన్ల కోసమే 'కాళేశ్వరం'..**

రాష్ట్రంలో రైతులకు కేవలం ఉచిత కరెంట్ కోసం రూ. 36 వేల కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వ్యవసాయ పనిముట్ల కోసం ఏటా వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు బీమా కోసం ఏటా రూ. 3,500 చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. వేల కోట్ల కమీషన్ల కోసమే హడావుడిగా కాళేశ్వరం కట్టారని కామెంట్ చేశారు. రూ. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయిందని అన్నారు. బోరు కింద పంట పండితే కూడా కాళేశ్వరం మహిమేనని మోసం చేశారని సీఎం ఫైర్ అయ్యారు. కూలిన కాళేశ్వరం నుంచి మూడేళ్లుగా చుక్కనీరు తీసుకోలేదని.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచిందని అన్నారు.

**కేసీఆర్ తాగుడు కల్చర్ తెచ్చిండు..**

ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులను సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్.. ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా అని ధ్వజమెత్తారు. దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా.. నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా అని అన్నారు. కానీ, ఊరూరికి మాత్రం బెల్ట్ షాపులు తెచ్చి తాగుడు కల్చర్ తెచ్చాడంటూ సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ చేసిన అధికారులకు ఘన వీడ్కోలు



జనగణమన ప్రతినిధి సిద్దిపేట:

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులకు మంగళవారం కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఆఫీస్ సూపరింటెండెంట్ వై. వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎడ్ల రాంమూర్తి, వరికోటి నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మామిడిపల్లి పెంటయ్యలను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, సన్మాన పత్రం, జ్ఞాపిక (మెమెంటో) అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారి కృషి చిరస్మరణీయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా వారు పోలీస్ కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా కమిషనరేట్‌ను సంప్రదించవచ్చని కమిషనర్ భరోసా ఇచ్చారు. వారి ఆరోగ్యం, ఆనందం, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో కూడిన విశ్రాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ చేసిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హైమావతి



జనగణమన ప్రతినిధి సిద్దిపేట:

చిన్నకోడూరు మండల కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) నిర్వహిస్తున్న విధానాన్ని స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్ఓ నిర్వహిస్తున్న రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇంటింటి సర్వేలో నమోదు చేస్తున్న వివరాలు, ఓటర్లకు పంపిణీ చేస్తున్న దరఖాస్తు ఫారాలు (ఫారమ్‌లు) తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతోందా లేదా అన్న విషయాన్ని పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ ఏజెంట్లు సర్వే ప్రక్రియను పరిశీలించేందుకు హాజరవుతున్నారా అని కలెక్టర్ ప్రశ్నించగా, ఉదయం వేళల్లో వారు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. సర్వే సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత సూపర్‌వైజర్ లేదా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం పొందాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

# తెలంగాణ భవిష్యత్తు బీజేపీదే

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2019, 2024 ఎన్నికల్లో 35 శాతం ఓట్లను సాధించడం ద్వారా తెలంగాణలో బీజేపీ తన ఉనికిని బలంగా చాటుకుందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ విజయాల వెనుక కూడా కార్యకర్తల కృషి కీలకమైందన్నారు.

**ప్రజల గొంతుకగా నిలవాలి..**

తెలంగాణలో మార్పు తీసుకురావాలంటే ప్రజల గొంతుకగా మారి, ఆ గొంతును వీధుల వరకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. 2028 నాటికి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడటానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసమే కారణమన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు చేశామని, సమ్మక్క–సారలమ్మ పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను కూడా కేంద్రం చేపట్టిందని తెలిపారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం ఆరు హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు.

**తెలంగాణలో 'ఆర్ఆర్ పన్ను' వసూలు..**

తెలంగాణ ప్రభుత్వం 'ఆర్ఆర్ పన్ను' ద్వారా ఢిల్లీ దర్బార్‌కు నిధులు తరలిస్తోందని ఆరోపించారు. వీధుల నుంచి శాసనసభ వరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ఈ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలే బీఆర్ఎస్ పతనానికి కారణమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే సంప్రదాయాలను కొనసాగిస్తోందని విమర్శించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి వేదికగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల డబ్బును ఢిల్లీకి తరలిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

(మొదటి పేజీ తరువాయి)


**అజెండాపై కసరత్తు.. రేపటికల్లా నివేదికలు..**

కేబినెట్ భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు అజెండా రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశాయి. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, మరియు వివిధ శాఖల కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సర్క్యులేషన్ ద్వారా ఆమోదించి, వాటిని తెలుగు అనువాదంతో సహా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదికలను రేపు అనగా జూలై 1వ తేదీ మధ్యాహ్నం 1:00 గంటల కల్లా ఖచ్చితంగా పంపాలని సీఎస్ ఆదేశించారు. ఒకవేళ ఏ శాఖలోనైనా అజెండా అంశాలు లేనట్లయితే.. 'నిల్' రిపోర్టును కూడా నిర్ణీత సమయానికి అందించాలని స్పష్టం చేశారు.

## పున్నం ప్రవీణ్‌కు సీపీ సన్‌ప్రీత్ సింగ్ ప్రశంసలు

**రాయపర్తి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కు రివార్డు అందజేత**

**అభినందించిన ఎస్సై ముత్యం రాజేందర్, ఇతర పోలీస్ సిబ్బంది**



జనగణమన ప్రతినిధి రాయపర్తి:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోర్టు ప్రాసెస్ విధులను సమర్థవంతంగా నిర్వహించి విశేష ప్రతిభ కనబరిచిన రాయపర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ పున్నం ప్రవీణ్‌కు రివార్డు అందింది. విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరి, కేసుల పర్యవేక్షణలో చూపిన నిబద్ధతను గుర్తించిన పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆయనను మంగళవారం ప్రత్యేకంగా అభినందిస్తూ రివార్డును అందజేశారు. కోర్టు ప్రాసెస్ విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ గుర్తింపు లభించడం రాయపర్తి పోలీస్ స్టేషన్ సిబ్బందికి గర్వకారణంగా నిలిచింది. విధి పట్ల అంకితభావంతో పనిచేస్తే ఉన్నతాధికారుల ప్రశంసలతో పాటు ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని ఈ సందర్భంగా మరోసారి స్పష్టమైంది. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా రివార్డు అందుకోవడం పున్నం ప్రవీణ్‌కు మరింత ఉత్సాహాన్ని కలిగించగా, రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్, సహచర పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయి పనితీరును కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## 2022 నాటి కేసులో రాజాసింగ్ నిర్దోషిగా విడుదల..

(మొదటి పేజీ తరువాయి)

**చివరకు న్యాయమే గెలిచింది..**

ఎవరు తనపై ఎన్ని కుట్రలు చేసినా.. చివరకు న్యాయమే గెలిచిందని రాజాసింగ్ అన్నారు. మొదటి నుంచి ఒకటే చెబుతున్నా.. ఎవరి మతపరమైన భావాలు, దేవుళ్లను కించపరిచేలా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. తనకు న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని.. అది ఇప్పుడు నిజమైందన్నారు. నాటి కేసులో కోర్టు తనను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునివ్వడం సంతోషంగా ఉందని అన్నారు. ఇక అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కాకుండా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తనపై పలు తప్పుడు కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. అయితే, గత కేసుల మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో నమోదైన ప్రతి తప్పుడు కేసు నుంచి కూడా తాను నిర్దోషిగా బయటకు వస్తాననే నమ్మకం తనకు ఉందని రాజాసింగ్ ధీమా వ్యక్తం చేశారు.

## ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్‌క్వార్టర్‌గా హైదరాబాద్..

(మొదటి పేజీ తరువాయి)

**విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు:**

భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తామని ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ సీఎంకు తెలిపారు. అలాగే, ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్ క్వార్టర్‌గా హైదరాబాద్‌ను పరిగణిస్తున్నామని చెప్పారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి సిద్ధంగా ఉన్నామని, తెలంగాణలో ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ ఆసక్తిని ప్రదర్శించారు.

## యాదగిరిగుట్టలో గెస్ట్ హౌస్‌లకు తిరుమల మోడల్..

(మొదటి పేజీ తరువాయి)

**వారంలో నివేదిక ఇవ్వండి:**

గుట్టపైన గెస్ట్ హౌస్‌ల నిర్మాణం కోసం ముందుకు వచ్చిన వాళ్ల జాబితా రూపొందించాలని విడతల వారీగా గెస్ట్ హౌస్ ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్నారు. గెస్ట్ హౌస్ ల నిర్మాణం పైన తిరుమల మోడల్ ను అనుసరించాలని భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలన్నారు. యాదగిరి గుట్ట ఆలయం నిర్మాణంపైన ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదిక పైన అధ్యయనంచేసి వారంలో నివేదిక ఇవ్వాలన్నారు. పబ్లిక్ ప్రైవేట్ విధానంలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సీఎంఓ సెక్రటరీ మానిక్ రాజ్, సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు,యాదాద్రి జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## మీ ద్రోహాన్ని మరిచిపోతారని అనుకోవడం అవివేకమే..

(మొదటి పేజీ తరువాయి)

72 సార్లు సీఎం ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారన్నారు. కేసీఆర్ టంచన్ గా 11 సార్లు, 73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని, పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. రేవంత్ రెడ్డి ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని ఇది గుర్తుపెట్టుకోవాలన్నారు.

## భారతీయ కళ, సంస్కృతిని భావితరాలకు అందించాలి..: మంత్రి జూపల్లి కృష్ణారావు

జనగణమన ప్రతినిధి హైదరాబాద్:

భారతీయ కళ, సంస్కృతిని భావితరాలకు అందించాలని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సాంస్కృతిక విభాగం, ఒడిశా సాంస్కృతిక శాఖల సౌజన్యంతో కళాకృతి నృత్యాలయ నిర్వహణలో యాదాద్రి జాతీయ నృత్యోత్సవం జూలై 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు యాదాద్రి డాన్స్ ఫెస్టివల్ చైర్మన్ బీఆర్ విక్రమ్ కుమార్, డైరెక్టర్ భారతి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం రవీంద్రభారతిలోని మంత్రి కార్యాలయంలో సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు యాదాద్రి నృత్యోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. కళలను, కళారూపాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. డైరెక్టర్ భారతి మాట్లాడుతూ.. భరతనాట్య దిగ్గజం, పద్మశ్రీ, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గీతా చంద్రన్‌కు యాదాద్రి జాతీయ ఎక్సలెన్స్ అవార్డును జూలై 25న ప్రదానం చేసి సత్కరిస్తున్నట్లు తెలిపారు. అలాగే, హైదరాబాద్ నాట్యాంజలి పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ నృత్యకారులు పలు అంశాల పై విశిష్ట నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు భారతి తెలిపారు.

జనగణమన
దినపత్రిక


## సంపాదకీయం

# సమైక్యతా మార్గంలోనే వికసిత భారత్

'భారతదేశం అంతటి గొప్ప దేశం మరొకటి ఉండదు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, యాసలు, ఆచారాలతో ఎంతో విభిన్నమైన మనుషులను ఏకతాటిపైకి తెచ్చింది మన దేశం. భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప భావనకు మించింది ఏముంటుంది?' -- ఇవి జూన్ 15న ఢిల్లీలో 'జాతీయ సమైక్యత కోసం... సేన ప్రస్థానం' సమావేశం నిర్వహించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారు చేసిన వ్యాఖ్యలు. "నేను ప్రతీసారీ ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అని ఎందుకు అంటానంటే మన మొదటి ప్రాధాన్యం దేశం అవ్వాలి. తర్వాతే ప్రాంతం. అయితే కొన్ని దశాబ్దాలుగా ఈ స్ఫూర్తి మెల్లగా తగ్గుతోంది. ఇది చాలా ప్రమాదకరం" అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వం, ప్రాంతీయతత్వం, కులతత్వం, భాషా దురభిమానం పెరిగిపోతున్న నేటి రోజుల్లో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వెనుక ఆవేదనను అర్థం చేసుకోవచ్చు.నిజానికి ఇన్ని విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు ఉన్న దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఇన్ని వైవిధ్యాలు ఉన్నా కూడా ఒక దేశంగా మనం ఉన్నామంటే కారణం మనలోని భిన్నత్వంలోని ఏకత్వ ?స్ఫూర్తే! భారతదేశం అంటే కేవలం భూభాగం కాదు, అది 140 కోట్ల ప్రజల గుండె చప్పుడు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి నాగాలాండ్ వరకు– భిన్నత్వమే మన బలం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత్‌లో 565 సంస్థానాలు ఉండేవి. ఇవి ప్రత్యేక దేశాలుగా మారితే భారత్ ముక్కలవుతుందని గ్రహించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రెండేళ్లలో అన్నింటినీ భారత్‌లో విలీనమయ్యేలా కృషి చేశారు. అందుకనే ఆయన్ను భారత సమైక్యతా శిల్పి అని గౌరవించుకుంటాం. జాతీయ సమగ్రత పట్ల, సుపరిపాలన పట్ల, ప్రజాసేవ పట్ల ఆయన అచంచల నిబద్ధత భావి తరాల వారికి స్ఫూర్తిదాయకం. భారత రాజ్యాంగం జాతీయ సమైక్యతకు ప్రాధాన్యమిచ్చి భారతదేశాన్ని ఒక సర్వసత్తాక, సామ్యవాదం, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. అయితే ఈ మధ్య కాలంలో 'భారతదేశం నా మాతృ భూమి, భారతీయులందరూ నా సహోదరులు' అన్న ప్రతిజ్ఞ నోటిమాటగానే మిగిలిపోతున్నది. భారతావనికి మూలమైన భిన్నత్వంలో ఏకత్వ భావన బీటలు వారుతుంది. భాష, యాస, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత విశ్వాసాలు, ప్రాంతాల ఆధారంగా తోటి భారతీయులను చిన్నచూపు చూస్తూ అపహాస్యం చేసే వికృత ధోరణి పెరిగిపోతుంది. జాతీయ సమైక్యత, సమగ్రతలను అవి ప్రమాదంలో పడేస్తున్నాయి.కులాభిమానం పేరుతో ఇతర కులాలను తక్కువ చేసి మాట్లాడడం, మతాన్ని రాజకీయంగా వాడుకోవడం, ప్రాంతీయాభిమానం ముసుగులో ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిలించడం, ఒక భాషపైన, యాస పైన అతి ప్రేమ, అభిమానం చూపిస్తూ ఇతర భాషల్ని తక్కువగా చేసి మాట్లాడడం నేడు చూస్తున్నాం. వసుధైక కుటుంబంగా ఉండాల్సిన మన దేశంలో... దేశాన్ని బలహీనపరిచే "మా రాష్ట్రం, మా ప్రజలు, మా భాష, మా నీళ్లు" అనే సంకుచితత్వాన్ని కొందరు నాయకులే పెంచి పోషిస్తున్నారు. ఈ అతి తత్వాలు దేశ సమగ్రతకు ముప్పుగా మారుతున్నాయి. మరోవైపు దేశాన్ని అస్థిరపరిచడమే ఏకైక లక్ష్యంగా పనిచేసే 'సీమాంతర ఉగ్రవాదం' మన జాతీయ సమగ్రతకు పెను సవాలుగా మారుతోంది. కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల సాధన కోసం నేరస్తులతో సంబంధాలను కొనసాగిస్తూ, దేశ సమగ్రతకు విఘాతం కలిగిస్తున్నారు. ఈ విషయాన్ని వోహ్రా కమిషన్ ఆధారాలతో సహా రుజువు చేసింది.విభజన వాదులతో జాతి సమైక్యతకు వాటిల్లిన ముప్పు నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత నేటి యువత పైనే ఉంది. సమాజంలో మార్పు కోరుకుంటే రాదు– ప్రయత్నిస్తేనే వస్తుందని యువత తెలుసుకోవాలి. "మా సమస్యకి వేరెవరో కారణం, ఎవరో నష్టపోతేనే మేము ప్రయోజనం పొందగలము" అనే ధోరణి అనాగరిక ప్రజాస్వామ్య సంస్కృతే తప్ప, ఆధునిక ప్రజాస్వామ్యం అనిపించుకోదని గ్రహించాలి. ఇక్కడ "నేను తెలుగువాడిని", "నేను తెలంగాణవాడిని" అనే భావన కంటే "నేను భారతీయుడిని" అనే భావన గొప్పది కావాలి. వేరే ప్రాంతం వారనో, వేరే భాష మాట్లాడుతున్నారనో, చూడడానికి భిన్నంగా కనిపిస్తున్నారనో సాటి భారతీయుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తే– భారత జాతీయతను అవమానించినట్లే! విపరీతమైన ప్రాంతీయతత్వం దేశ సమైక్యతకు భంగం కలిగిస్తుంది. భారత్‌ను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి బ్రిటిష్‌వారు 'విభజించు, పాలించు' సూత్రానికి అనుగుణంగా ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించడమే భారత్ -- పాకిస్థాన్ విడిపోవడానికి దారితీసింది. మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా యువత అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రాల సమాహారమైన మన దేశంలో ఎక్కడివారైనా, ఎక్కడికైనా వెళ్లి, స్థిరపడి, శాంతియుతంగా పనిచేసుకోవచ్చని రాజ్యాంగం స్పష్టం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి ఉండడం భారతీయులందరి కర్తవ్యం.ఏ దేశానికైనా బలం ఆ దేశ ఐక్యతే! ఏ దేశాభివృద్ధి అయినా అక్కడి ప్రజల ఐక్యతతోనే సాధ్యమవుతుంది. జాతీయ సమగ్రత అనేది వివిధ రకాల పువ్వులతో కట్టిన దండ లాంటిది. ప్రతి పువ్వు రంగు, వాసన వేరు. కానీ దారం ఒక్కటే. ఆ దారం తెగితే దండ విడిపోతుంది. ఆ దారమే "భారతీయత".

# పెట్టుబడిదారీ విధానం, ఉపాధి కల్పన చరిత్ర ఏం చెప్తోంది?

పద్దెనిమిదవ శతాబ్దం చివరి భాగంలోను, 19వ శతాబ్దం తొలి భాగంలోను బ్రిటన్‌లో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న కాలంలో కొత్తగా తెచ్చిన యంత్రాల మీద తయారైన సరుకుల వలన చాలామంది చేతివృత్తిదారుల ఉపాధి పోయింది. అది యంత్రాల ప్రవేశానికి వ్యతిరేకంగా సాగిన లుడ్డైట్ ఉద్యమానికి దారితీసింది. నిరుద్యోగం పెరగడంతో పేదరికం కూడా పెరిగింది. అయితే కొన్ని ఏళ్ల అనంతరం 19వ శతాబ్దం తర్వాతి భాగంలో ఆ దేశంలో దారిద్ర్యంతో బాధపడే ప్రజానీకం శాతం తగ్గింది. నిరుద్యోగంతో బాధపడేవారి సంఖ్య కూడా తగ్గింది.అప్పటి బ్రిటన్ అనుభవం పెట్టుబడిదారీ విధానంలో ఇమిడివున్న ఒక స్వభావసిద్ధ లక్షణం అని చెప్తూ దానిని మొత్తం పెట్టుబడిదారీ దశకే వర్తింపజేస్తుంటారు కొందరు. పెట్టుబడి ప్రవేశించినప్పుడు మొదట్లో కొంత నిరుద్యోగానికి అది దారి తీయవచ్చునని, అయితే ఆ పెట్టుబడి ప్రవేశం వలన మొత్తం మీద ప్రజానీకపు స్థితిగతులు మెరుగుపడతాయని, క్రమేణా, ఆర్థిక అసమానతలు పెరిగినా, అంతకు మునుపటి కన్నా ప్రజలందరి జీవన ప్రమాణాలూ మెరుగుపడతాయని వారు వాదిస్తుంటారు. ఈ వాదన చాలా విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఏ దేశంలోనైనా భారీ స్థాయిలో నిరుద్యోగ సమస్యను చవిచూస్తున్నప్పుడు ఆ దేశం తన వద్ద పెట్టుబడులు పెట్టేలా పెట్టుబడిదారులను ఆకర్షించడమే పరిష్కారమని వాళ్ళు సలహా ఇస్తూంటారు. ఇప్పుడు మన దేశంలోని ఏ రాష్ట్రానికైనా ఈ పరిష్కారాన్నే ఒక మంత్రం లాగా వాళ్ళు చెప్తున్నారు. "మీది పేద రాష్ట్రం అయితే పెట్టుబడిదారులకు భారీగా రాయితీలు ఇవ్వండి. అప్పుడు వాళ్ళు వచ్చి మిమ్మల్ని పేదరికం నుండి బైటకి తీసుకొస్తారు." ఇదే ఆ మంత్రం.ఇలా చెప్పడానికి వారి దగ్గర ఎటువంటి సిద్ధాంతపరమైన ప్రాతిపదికా లేదు సరికదా, వాళ్ళు చరిత్రలో వాస్తవంగా జరిగిందేమిటో తెలుసుకోవడంలో పూర్తిగా పొరపాటు పడుతున్నారు. కొత్త యంత్రాలను ప్రవేశ పెట్టడం అనేది ఒకే ఒక్కసారి మాత్రమే జరిగే వ్యవహారం అయితే అప్పుడు మాత్రమే, అది కూడా పోగుబడ్డ పెట్టుబడిని మళ్ళీ పెట్టుబడి పెట్టే వేగం తగ్గకుండా కొనసాగితేనే, ఆ యంత్రాల ప్రవేశం కారణంగా మొదట్లో తలెత్తిన నిరుద్యోగాన్ని అధిగమించడం, అదనంగా ఉద్యోగాలను కల్పించడం సాధ్యపడుతుంది. కాని, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానంలో నిరంతరం కొత్త యంత్రాల కోసం, కొత్త సరుకుల ఉత్పత్తి కోసం పరిశోధనలు, ప్రయత్నాలు కొనసాగుతూనే వుంటాయి. అందువలన నిరంతరం కార్మికులకు ఉన్న ఉద్యోగాలు పోతూనే వుంటాయి. అందుచేత పెట్టుబడిదారీ విధానం వలన ఏర్పడిన నిరుద్యోగం ఆ వ్యవస్థలో ఎన్నటికీ అదృశ్యం కాదు. పెట్టుబడిదారీ విధానం నిరుద్యోగాన్ని లేకుండా చేసేస్తుందని చెప్పడానికి ఎటువంటి సైద్ధాంతిక ప్రాతిపదికా లేదు.ఇక చారిత్రికంగా చూద్దాం. అప్పట్లో యంత్రాల ప్రవేశం కారణంగా తలెత్తిన నిరుద్యోగం లుడ్డైట్లను ఆగ్రహావేశాలకు గురి చేసింది. కాని ఆ తర్వాత నిరుద్యోగం ఉపశమించింది. దానికి కారణం పెట్టుబడిదారీ విధానంలో స్వభావసిద్ధంగా ఉన్న లక్షణం ఏదీ కాదు. అప్పుడు నిరుద్యోగం తగ్గడానికి మూడు స్పష్టమైన కారణాలు ఉన్నాయి. బ్రిటన్ నుండి, ఐరోపా ఖండం నుండి కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలకు దాదాపు 5 కోట్ల మంది వలసలు వెళ్ళారు. అక్కడికి వలసలు పోయి, స్థానికులను ఊచకోత కోసి, తరిమివేసి ఆ ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. వ్యవసాయదారులుగా మారారు. 1815 నుండి 1914 మధ్య శతాబ్దం కాలంలో బ్రిటన్‌లో ఎంతమంది కొత్తగా జనాభా పెరిగారో, వాళ్ళలో సగం మంది ఈ కొత్త ప్రాంతాలకు వలసపోయారు. దీని ఫలితంగా బ్రిటన్‌లో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది.ఇక రెండో కారణం చూద్దాం. ఈ పెట్టుబడిదారీ దేశాలు కొన్ని ఇతర దేశాలను తమ పెత్తనం కిందకు తెచ్చుకున్నాయి. భారతదేశం కూడా వాటిలో ఒకటి. 19వ శతాబ్దం మొత్తం ఈ వలస దేశాల్లో జీవించే స్థానిక వృత్తిదారుల ఉత్పత్తులను దెబ్బ తీస్తూ తమ వద్ద యంత్రాల మీద ఉత్పత్తి అయిన సరుకులను తెచ్చి గుమ్మరించారు. దాంతో స్థానిక చిన్న ఉత్పత్తిదారులు నాశనమయ్యారు. ఈ క్రమాన్నే పారిశ్రామిక వినాశనం (డీ ఇండస్ట్రియలైజేషన్) అని అంటారు. అంటే యంత్రాల ద్వారా జరిగిన ఉత్పత్తి అక్కడ బ్రిటన్‌లో పెద్దగా నిరుద్యోగానికి దారి తీయలేదు కాని ఇక్కడ వలస దేశాల్లో భారీ నిరుద్యోగానికి దారి తీసింది.ఇక మూడవ కారణం: మొదట్లో యంత్రాల తయారీకి చాలా పెద్ద సంఖ్యలో మనుషులు అవసరమయ్యారు. అందుచేత యంత్రాల ప్రవేశం వలన పనులు పోతున్నా, యంత్రాల తయారీకి కూడా పెద్ద సంఖ్యలో మనుషులు అవసరమైనందున మొత్తం మీద ఉద్యోగాలు తగ్గిపోవడం అనేది పరిమితంగానే ఉండేది.ఈ మూడు కారణాలూ ఏ విధంగా చూసినా, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావసిద్ధ లక్షణం నుంచి వచ్చినవి కానేకావు. మొదటి రెండు కారణాలూ వలస విధానం పర్యవసానంగా వచ్చాయి. ఇక మూడవ కారణం కూడా ఆ ప్రత్యేక సందర్భంలో ఉన్నదే కాని పెట్టుబడిదారీ విధానపు స్వభావం నుంచి వచ్చినది కాదు. అటువంటిది అన్ని సందర్భాల్లోనూ ఏర్పడదు. అందుచేత పెట్టుబడిదారీ విధానం వలన తాత్కాలికంగా నిరుద్యోగం పెరిగినా, మొత్తం మీద దీర్ఘకాలంలో అభివృద్ధి జరుగుతుందని, ప్రజల స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పడానికి ఎటువంటి ఆధారమూ లేదు. అది ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఆ కాలంలో ఒక ప్రత్యేక సందర్భంలో ఐరోపా ఖండంలో జరిగిన ప్రత్యేక పరిణామాలను మొత్తం ప్రపంచానికంతటికీ, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ అంతటికీ వర్తింపజేయబూనుకోవడం సరి కాదు.ఇంకా చెప్పాలంటే నేటి పెట్టుబడిదారీ విధానం "అభివృద్ధి" అనేదానికే వ్యతిరేకంగా ఉంది. కొన్ని గణాంకాలను పరిశీలిస్తే ఇది కనిపిస్తుంది. 2010–2020 మధ్య దశాబ్ద కాలంలో ప్రపంచ జిడిపి వార్షిక వృద్ధి రేటు 2.6 శాతం. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలం మొత్తం మీద ఇది ఏ దశాబ్దానికన్నా తక్కువగా ఉంది. ఈ దశాబ్దంలోని మొదటి ఐదు సంవత్సరాల్లో ప్రపంచ శ్రామిక ఉత్పాదకత ఏటా 1.8 శాతం చొప్పున పెరిగితే తర్వాత ఐదు సంవత్సరాల్లో అది 1.4 శాతానికి పడిపోయింది. అంటే సగటును మొత్తం దశాబ్ద కాలానికి 1.6 అని అనుకోవచ్చు. జిడిపి వృద్ధి రేటుకి, ఉత్పాదకత పెరుగుదల రేటుకి మధ్య తేడా ఎంత ఉంటుందో ఉపాధి కూడా అదే రేటులో పెరుగుతుంది. అంటే ఈ దశాబ్దకాలంలో ఉపాధి వృద్ధి 1 శాతం మాత్రమే. కాని ప్రతే ఏటా కార్మికుల సంఖ్య 1.5 చొప్పున పెరుగుతోంది. అంటే ప్రపంచం మొత్తం మీద నిరుద్యోగం పెరుగుతూనే పోతోంది. కరోనా అనంతర కాలంలో ప్రత్యేకంగా ప్రభుత్వాల వ్యయాలు పెరిగినే కాలం ఇది ఈ దశాబ్దంలోనే పరిస్థితి ఇలా ఉందంటే కరోనాకు ముందరి దశాబ్ద కాలంలో, అంటే ప్రభుత్వ వ్యయం బాగా తక్కువ స్థాయిలో ఉన్న కాలంలో, నిరుద్యోగం ఇంకా ఎక్కువ మోతాదులో ఉండి వుండాలి.పెట్టుబడిదారీ వ్యవస్థ తాజా దశ అయిన నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధి వేగం తగ్గిపోతోంది. దీనికి కారణం ఆ విధానాల అమలు ఫలితంగా అసమానతలు బాగా ఎక్కువగా పెరిగిపోవడం, ప్రభుత్వాలు జోక్యం చేసుకునే శక్తి బాగా తగ్గిపోవడం. అందుచేత నయా ఉదారవాద పెట్టుబడిదారీ దశలో ఉపాధి కల్పనలో కూడా అభివృద్ధి వేగం తగ్గిపోతుంది. కార్మికుల సంఖ్య పెరిగే వేగం కన్నా కూడా తగ్గిపోతుంది. అందుచేత నయా ఉదారవాద విధానాలలోనే స్వభావసిద్ధంగా నిరుద్యోగాన్ని పెంచే లక్షణం ఉంది.అయితే, పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేసే దేశాలన్నీ కూడా నిరుద్యోగాన్ని పరిష్కరించడంలో విఫలమయి తీరుతాయని అనుకోనక్కర్లేదు. ఏ దేశాలైతే తమ వద్ద ఉన్న నిరుద్యోగాన్ని పరిష్కరిస్తాయో అవి అందుకోసం ఇతర దేశాల్లో నిరుద్యోగం పెరిగిపోడానికి కారణమౌతాయి. అంటే అన్ని దేశాలూ పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేసి అన్నీ అభివృద్ధి దిశగా పురోగమించడం అనేది అసాధ్యం. ఇక్కడ అభివృద్ధి అంటే పేదరికాన్ని అధిగమించడం అని గ్రహించాలి. ప్రపంచం మొత్తంగా కలిపి చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానాన్ని కొనసాగించడం అనేది పేదరికాన్ని అనివార్యంగా పెంచుతుంది.ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థల మేథోపరమైన హస్తలాఘవం ఇక్కడే మనకు కనిపిస్తుంది. కొన్ని దేశాలు పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన నడిచి తమ పేదరికాన్ని అధిగమించాయి. వాటినే ఉదాహరణలుగా చూపి ప్రపంచం మొత్తం ఇదే విధంగా అధిగమించగలుగుతుంది అని ప్రపంచ బ్యాంక్ బోధిస్తుంది. ఉదాహరణలుగా చూపిన ఆ దేశాలు తమ పేదరికాన్ని అధిగమించే సమయంలోనే దాని ఫలితంగా మరికొన్ని దేశాల పేదరికం మరింత పెరిగిందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనంతటినీ కలిపి చూసినప్పుడు పేదరికం పెరుగుతున్న తీరు వేగం పుంజుకుంటున్నదని కనిపిస్తుంది. ప్రపంచబ్యాంక్ చెప్తున్నదానికి ఇది పూర్తి విరుద్ధం.వాస్తవానికి కొన్ని దేశాలు, సాపేక్షంగా చిన్న దేశాలు, తమ వద్ద ఉండే కొద్దిపాటి నిరుద్యోగాన్ని అధిగమించాయి. అందుకోసం అవి సంపన్న దేశాల నుండి పెట్టుబడులను ఆహ్వానించాయి (ఆసియా పులులు ఒక ఉదాహరణ). కాని ఇవి అరుదైన మినహాయింపులే తప్ప సర్వసాధారణ ఉదాహరణలు కాలేవు. ఇటువంటి చిన్న చిన్న దేశాలకు వర్తించే అనుభవాలు అపారంగా నిరుద్యోగం ఉన్న భారతదేశం వంటి పెద్ద దేశాలకు అస్సలు వర్తించవు. మనకి ఈ నిరుద్యోగం వలస పాలనా కాలం నుంచీ, వారి దోపిడీ పుణ్యమా అని ఒక శాపంలాగా చుట్టుకుంది. పెద్ద ఎత్తున వ్యవసాయ రంగం ఉండడంతో దాని మాటున ఈ నిరుద్యోగం నివురుగప్పిన నిప్పులాగా ఉంది. పెట్టుబడిదారీ మార్గాన ఇటువంటి దేశం వెనుకబాటుతనాన్ని అధిగమించి అభివృద్ధి సాధించి నిరుద్యోగాన్ని రూపుమాపుతుంది అని ఆశించడం అర్థం లేనిది. నయా ఉదారవాద విధానాల ప్రవేశానికి ముందరి కాలంలో ఈ వాస్తవాన్ని బాగానే అర్థం చేసుకున్నారు. అందుకే ప్రభుత్వ జోక్యంతో కొంతమేరకు అభివృద్ధి సాధించారు. కాని నయా ఉదారవాద దశలో పెట్టుబడిదారీ భక్తి ఎంత ఎక్కువగా ఎక్కిస్తున్నారంటే గతంలో అర్థం చేసుకున్నది ఇప్పుడు మరిచిపోయారు. భ్రమల్లో పడ్డారు. ఈ భ్రమల నుండి ప్రజలు ఎంత వేగంగా బైట పడగలిగితే అంత తొందరగా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేయగల ప్రత్యామ్నాయ విధానాల వైపు అడుగులు వేయడానికి వీలౌతుంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసి తద్వారా అభివృద్ధి క్రమం వేగాన్ని నిలకడగా పెంచుకుంటూ పోవడం సాధ్యపడుతుంది. పెట్టుబడులు దేశ సరిహద్దులు దాటిపోడానికి వీలు లేకుండా నియంత్రించి, ప్రభుత్వ రంగాన్ని బలంగా నిలబెట్టి తద్వారా పెట్టుబడిదారుల ఒత్తిళ్లను తిప్పికొట్టి ముందుకు పోవడం కుదురుతుంది. ఇదెంత తొందరగా జరిగితే మానవాళికి అంత మేలు.




**ప్రభాత్ పట్నాయక్**

# 'అయోధ్య' కుంభకోణం..

జనమందరికీ శకునం చెప్పే బల్లి తానే కుడితిలో పడిందన్న సామెత బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ, సంఘ పరివారానికి సరిగ్గా నప్పుతుంది. మేం తినం వేరొకర్ని తిననివ్వం అంటూ పొద్దున లేచింది మొదలు అవినీతిపై సూక్తి ముక్తావళి వల్లించే కాషాయ పెద్దలకు అయోధ్య రామాలయంలో దొంగల ఉదంతం గంగ వెర్రులెత్తిస్తున్నది. బాల రామునికి భక్తులు, దాతలు ఎంతో విశ్వాసంతో సమర్పించిన వజ్రాల వంటి విలువైన వస్తువులు, రూ.200 కోట్ల చోరీ పెను సంచలనమైంది. ఇంటి దొంగల ఈ నిర్వాకాన్ని బయట పెట్టింది కూడా అయోధ్య రామాలయ ట్రస్ట్ వారే కావడం విశేషం. ఆలయ ట్రస్టు సభ్యుడొకరు ఇచ్చిన ఫిర్యాదుపై రామ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నిధుల దుర్వినియోగం, మోసం, విశ్వాస ఉల్లంఘన, నేర పూరిత కుట్ర వంటి బిఎన్ఎస్‌లోని సెక్షన్ల కింద ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని యుపి బిజెపి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసి అభియోగాలెదుర్కొంటున్న వారిని అరెస్టు చేసింది. ఈ పరిణామంతో ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేశారు. ఇంకో వైపు ఆలయంలో దొంగతనంపై సమగ్ర దర్యాప్తు కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది.తమకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే అయోధ్య గుడిలో తమ వారే భక్తుల విశ్వాసాన్ని వమ్ము చేసి పెద్ద ఎత్తున కానుకలు, నగదు ఎత్తుకుపోయిన వ్యవహారంపై బిజెపి కాని, ప్రధాని నరేంద్ర మోడీ కాని స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తుంది. చీమ చిటుక్కుమన్నా మన్ కీ బాత్, చాయి పే చర్చాలను నిర్వహించే ప్రధానికి అయోధ్యలో ఇంటి దొంగల దోపిడీ చర్చనీయాంశం కాకపోవడం ఆశ్చర్యమే! అయోధ్య ఆలయంలో చోరీపై యోగి సర్కార్ నియమించిన సిట్ కంటి తుడుపు చర్యగా ప్రతిపక్షాల నుంచే కాదు సాధు సంతుల నుంచి, విహెచ్‌పి వంటి హిందూ సంస్థల నుంచి సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు సూత్రధారులు, పాత్ర ధారులను రక్షించి, కింది స్థాయి సాధారణ ఉద్యోగులపై కేసు నెట్టేసేందుకే సిట్ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలైన నిందితులెవరో నిగ్గు తేలాలంటే నిష్పక్షపాత సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి. రాజకీయ, ప్రతిష్టాత్మక కేసు అయినందున దర్యాప్తుపై న్యాయస్థానం పర్యవేక్షణ ఉండాలన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. ఆ విధంగా కేంద్రం, యుపి ప్రభుత్వం తూతూ మంత్రంలా కానిస్తే సత్యానికి పాతరేసి, నిందితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాపాడుతున్నాయన్న భావన కలుగుతుంది.బిజెపి ఏలుబడిలో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రాల్లో అవినీతి, అక్రమాలకు హద్దు లేకుండా పోతోంది. వ్యవసాయ మంత్రి ఒక రాయితీ ఇప్పించేందుకు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణ వచ్చింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి భూ కుంభకోణానికి పాల్పడ్డారనన్న విమర్శ వెలువడింది. అదే రాష్ట్రంలో గతంలో ఉద్యోగుల నియామకాల్లో వెలుగు చూసిన వ్యాపం స్కాం ఉండనే ఉంది. అక్కడి దాకా ఎందుకు, కరోనా సమయంలో 'పిఎం కేర్' విరాళాలపై ఆరోపణలొచ్చాయి. అదానీ అవినీతి గురించి చెప్పనవసరం లేదు. నీట్ సహా పలు పరీక్ష పత్రాల లీకేజిలకు బిజెపి ప్రభుత్వాల అవినీతే హేతువు. కేవలం సాంకేతిక కారణాల వలన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంలో మోడీ ప్రభుత్వం తప్పించుకుంది. ఐపిఎల్ కుంభకోణం కింగ్‌పిన్ లలిత్ మోడీ వ్యవహారం సరేసరి! కర్ణాటకలో మైనింగ్ మాఫియాను నడిపిన గాలి జనార్దన్‌రెడ్డికి, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప అవినీతిని పెంచి పోషించింది బిజెపి నాయకత్వమే. చెప్పుకుంటూ పోతే బిజెపి పాలనలో అవినీతి చిట్టా కొండవీటి చాంతాండంత. ఇంతటి అవినీతి పంకిలంలో పొర్లాడుతూ తాము పునీతులమనడం బిజెపికి, ప్రధానికే చెల్లింది. అయోధ్యలో చోరీపై సనాతన ధర్మాన్ని నెత్తికెత్తుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కిమ్మనడంలేదు.

# అశ్వారావుపేట 'దొంతికుంట'పై అక్రమార్కుల పంజా.. అధికారుల లంచాల 'దందా'!

## మట్టిపై కాసుల కక్కుర్తి: రూ. 2 లక్షలు నొక్కుతూ ఏసీబీకి దొరికిన ఇరిగేషన్ ఏఈ! రికార్డుల్లో 23 ఎకరాల 38 కుంటలు.. క్షేత్రస్థాయిలో కరిగిపోతున్న చెరువు విస్తీర్ణం!




అశ్వారావుపేట జూలై 1 జనగణమన ప్రతినిధిప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుల్లోని పూడికమట్టిని సమీప రైతులు ఉచితంగా వాడుకోవాలనే స్పష్టమైన జీవో ఉన్నప్పటికీ.. అశ్వారావుపేట ఇరిగేషన్ శాఖకు మాత్రం అది కాసుల కురిపించే చెట్టుగా మారింది. దొంతికుంట చెరువు సమీపంలోని ఒక సామాన్య రైతు తన పొలానికి మట్టి తోలుకునేందుకు అనుమతి కోరగా, ఇరిగేషన్ ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్) ఏకంగా రూ. 2 లక్షల లంచం డిమాండ్ చేశారు. అవినీతి అధికారుల ఆట కట్టించాలనుకున్న ఆ రైతు ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ)ని ఆశ్రయించడంతో, లంచం సొమ్ము తీసుకుంటూ ఏఈ రెడ్ హ్యాండెడ్‌గా బుక్కవ్వడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది.లంచం ఇస్తేనే జీవో అమలు.. లేదంటే కొర్రీలు!రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జీవోలు జారీ చేస్తే, ఇరిగేషన్ అధికారులు మాత్రం దాన్ని లంచాల సంపాదనకు పెట్టుబడిగా మార్చుకున్నారు. చెరువు మట్టిపై కక్కుర్తి పడి రూ. 2 లక్షలు ఇస్తేనే అనుమతి ఇస్తామంటూ సదరు రైతును వేధించారు. చివరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి, నిందితుడు లంచం డబ్బులు చేతిలోకి తీసుకోగానే మెరుపు దాడి చేసి రసాయన పరీక్షలతో సహా నల్లధనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఆక్రమణలపై నిర్లక్ష్యం.. లంచాలపైనే శ్రద్ధ!ఈ లంచం ఉదంతం వెనుక పెద్ద కథే ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దొంతికుంట చెరువు విస్తీర్ణాన్ని కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారని గతంలో పత్రికల ద్వారా అనేక కథనాలు వచ్చాయి. కొంతమంది స్వార్ధపరులు చెరువు బఫర్ జోన్‌ను మట్టితో పూడ్చివేసి ఆక్రమించుకుంటున్నా, స్థానిక ప్రజలు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదు. అక్రమార్కుల నుంచి ముడుపులు అందుతుండటం వల్లే అధికారులు అప్పట్లో స్పందించలేదనే దానికి, ఇప్పుడు దొరికిన రూ. 2 లక్షల లంచం ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

**కోట్ల విలువైన భూమి.. 'గులాంగిరి' చేస్తున్న అధికారులు!**

రెవెన్యూ రికార్డుల ప్రకారం దొంతి కుంట చెరువు విస్తీర్ణం 23 ఎకరాల 38 కుంటలు ఉండాలి. కానీ, అశ్వారావుపేట పట్టణంలో భూముల ధరలు కోట్లలో పలుకుతుండటంతో, అభివృద్ధి పేరుతో బఫర్ జోన్‌ను మింగేస్తూ చెరువు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గిస్తున్నారు.అసలు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువుకు నిర్దిష్టమైన సరిహద్దు రాళ్ల (ఎఫ్.టి.ఎల్ బోర్డులు) ఎందుకు పాతలేదు

గతంలో చెరువును పూడుస్తుంటే ఎందుకు మౌనం వహించారుఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం.. అక్రమార్కులకు అధికారులు చేస్తున్న 'గులాంగిరి'యే అని స్పష్టమవుతోంది. కోట్లు పలికే భూముల కోసం చెరువు ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు.

**త్రాగునీరు, సాగునీటికి ముప్పు.. కాపాడాల్సిందే!**

అశ్వారావుపేట పట్టణానికి త్రాగునీరు, అలాగే సమీప రైతుల పొలాలకు సాగునీరు అందించే ప్రధాన వనరు ఈ దొంతికుంట చెరువు. ఇలాంటి జీవనాధారమైన చెరువును అక్రమార్కుల స్వార్థానికి, అధికారుల లంచగొండితనానికి వదిలేస్తే భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎడారిగా మారడం ఖాయం.లంచం తీసుకుంటూ దొరికిన ఏఈ వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు చెరువు బఫర్ జోన్‌ను కబ్జా చేసిన అక్రమార్కులు ఎవరు అనే విషయాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలి. రెవెన్యూ రికార్డుల ప్రకారం 23 ఎకరాల 38 కుంటల భూమిని సర్వే చేసి, సరిహద్దు రాళ్లు పాతి చెరువును తక్షణమే సంరక్షించాలి.

# కస్తూరిబా గాంధీ విద్యాలయంలో దుప్పట్లు పంపిణీ




సింగరేణి జూన్ 30జనగణమన ప్రతినిదికారేపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఝాన్సీ సౌజన్య అధ్యక్షతన బకెట్స్, బెడ్ షీట్స్, కార్పెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కారేపల్లి గ్రామ సర్పంచ్ మేదిరి టోనీ, మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉచిత విద్య తోపాటు సకల వసతులు కల్పిస్తున్నారని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నాణ్యమైన భోజనం, ప్రతి విద్యార్థినులపై ఉపాధ్యాయులు దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించడం కోసం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీ సౌజన్య, గ్రామ సర్పంచ్ టోనీ, మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, ఉపాధ్యాయులు షాహిన కౌసర్ ,వసంత, కవిత, విజయ ,మమత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# విబిజిరామ్ జి బిల్లును రద్దు చేయాలి

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి**
**జూలై 1న పంచాయతీ కార్యాలయాల ముందు నిరసన జయప్రదం చేయండి**



సింగరేణి జులై 30 జనగణమన ప్రతినిది పి వి జి రామ్ జి బిల్లు రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీ ణ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ కొండబోయిన నాగేశ్వరరావు లు డిమాండ్ చేశారు. మంగళవారం కేశగాని ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2004లో యూపీఏ కేంద్ర ప్రభుత్వం వామపక్షాలు సాధించుకున్న మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరిస్తూ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం పేదల నుండి ఉపాధి దూరం చేయుటకు విభిజి రాంజీ బిల్లును తీసుకువచ్చి జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాల అనడం 125 రోజుల పని దినాలు కల్పిస్తున్న బడ్జెట్లో మూడున్నర లక్షల కోట్లు కేటాయించాలి కానీ కేవలం ఈ సంవత్సరం బడ్జెట్లో 90 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని రెండు పూటల ఫోటో విధానం తదితర అంశాలతో తీసుకువచ్చిన ఈ కొత్త బిల్లు పేదలను ఉపాధి పనికి దూరం చేయడమే అని వారు ఆవేదన వ్యక్తం చేశారు కొత్తగా తీసుకొచ్చిన విబిజిరామ్ జి పథకాన్ని రద్దు చేసి ఉపాధి హామీ గ్యారంటీ చట్టాన్ని కొనసాగించాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు తెలిపారు కొలతలతో సంబంధం లేకుండా రెండు వందల రోజుల పని దినాలు కల్పించి రోజు కూలి రూ 600 చెల్లించాలని కేంద్ర బీజేపీ విధానాన్ని నిరసిస్తూ ఈనెల1 తేదీన రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందు వినతి పత్రాలు సమర్పించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమాలు సంఘం నాయకులు యనమనగండ్ల రవి. ఆమంచి అంజయ్య. కిన్నెర రామచంద్రయ్య. చింతపల్లి ప్రసాద్. బలమల్ల యోహాన్. ఇటుకల లెనిన్. తూము సుధాకర్, బాణాల శ్రీనివాసరావు,చల్ల మల్లమ్మ, గుమ్మ నరసింహారావు, పాసిని నాగేశ్వరరావు, రామచంద్రయ్య, షేక్ సైదులు, దాసరి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# పిల్లలకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యను బోధించాలి.



భద్రాచలం 30 జూన్ జనగణమన ప్రతినిధి గిరిజన సంక్షేమ ఆధ్వర్యంలో నడపబడుతున్న జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు పునాది నుండే విద్యావ్యవస్థ బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు ప్రతి పిల్లవానికి అందరికీ అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం చర్ల మండలంలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలోని చత్తీస్గడ్ రాష్ట్రంకు ఆనుకొని ఉన్న చెన్నాపురం, ఉయ్యాల మడుగు జిపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో కాసేపు ఉపాధ్యాయుని



పాత్ర పోషించిన అనంతరం విద్యార్థి పాత్ర పోషించి ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన అంశాలు పిల్లలకు బోధిస్తున్న తీరును మరియు తానే స్వయంగా పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వర్క్ బుక్ లోని ప్రతి అంశం పిల్లల ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు చతుర్వేద ప్రక్రియలలో వెనుకబడి ఉన్నట్లు ఆయన గమనించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ప్రతి పిల్లవానికి తెలిసి ఉండాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలని అన్నారు. పిల్లల హాజరు శాతం తక్కువగా ఉండకుండా చూసి, పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా సంబంధిత ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రతిరోజు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించేలా వారి తల్లిదండ్రులకు సూచించాలని అన్నారు.ఉపాధ్యాయులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలలకు రావాలని,ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పై అధికారులు దృష్టికి తీసుకొని రావాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వాహణ తప్పనిసరిగా పిల్లలు అర్థం చేసుకొని రాసేలా ఉపాధ్యాయులు పిల్లలను ఉత్తేజపరచాలని అన్నారు. చెన్నాపురం పాఠశాలలో 55 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారని మరొక ఉపాధ్యాయుని నియమించాలని కోరగా త్వరలోనే ఇంకొక ఉపాధ్యాయుడిని నియమిస్తానని పిఓ తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవో బి రాహుల్ ఆదేశాల మేరకు డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని శ్రీమతి చందన తిమ్మిరి గూడెం జిపిఎస్ పాఠశాలను సందర్శించారుఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు...

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం సేవే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు...

## నిరుపేద యువకుడికి పునర్జన్మనిచ్చిన వైద్య బృందం

భద్రాచలం జూన్ 30 జనగణమన ప్రతినిదివెంకటాపురం మండలం, సుదిబాక గ్రామానికి చెందిన 28 ఏళ్ల యువకుడు మడప భాస్కర్ విద్యుత్ షాక్‌కు గురై శరీరంలో సుమారు 60 శాతం వరకు తీవ్ర కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ప్రాణాలు కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించగా, సుమారు రూ.20 నుండి రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబం చికిత్స కోసం తమ పొలాలను కూడా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇక చికిత్స కొనసాగించే స్థోమత లేక తీవ్ర ఆవేదనలో ఉన్న కుటుంబ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ తెల్లం వెంకటరావు ని ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, రోగిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపట్టారు.ఆసుపత్రిలో జనరల్ సర్జన్ అందుబాటులో లేని పరిస్థితుల్లో, స్వయంగా జనరల్ సర్జన్ అయిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు నాలుగు నుంచి ఐదు గంటలపాటు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ బి. దేవరాజ్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ తాటి మల్లేష్, డాక్టర్ నికిత, డాక్టర్ కౌండిన్య, నర్సింగ్ సిబ్బంది, అనస్థీషియా బృందం, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమిష్టిగా కృషి చేశారు..ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి క్లిష్టమైన కేసుకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు స్వయంగా శస్త్రచికిత్స చేయడం అభినందనీయమని, ఆయన సేవాభావం ప్రభుత్వ వైద్య సేవల పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడుతూ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.రోగి తల్లిదండ్రులు మాట్లాడుతూ, "చికిత్స కోసం మా ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక మాకు దారి కనిపించని సమయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు , భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మా బిడ్డకు కొత్త జీవితం ఇచ్చారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాము" అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించగల సామర్థ్యం ఉందని, భద్రాచలం ఏరియా ఆసుపత్రి మరోసారి నిరూపించిందని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.


# ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి

**యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ సైదులు**



జవహర్‌నగర్, జూన్ 30 జనగణమన ప్రతినిది తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో జవహర్‌నగర్ ప్రధాన బస్టాండ్ ఆవరణలోని బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద మంగళవారం ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్‌నగర్ రక్షక భట నిలయం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులు, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువకులు గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. జవహర్‌నగర్ పరిధిలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు 100 లేదా 1903 నంబర్లకు సమాచారం అందించి వాటి నియంత్రణకు సహకరించాలని కోరారు.అలాగే ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల కాల్స్, లింకులు, సందేశాలను నమ్మి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాల కారణంగా అనేక మంది ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముందస్తు జాగ్రత్తలతో ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో క్రాంతి కళాబృందం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటాచారి, ఎస్సై రామ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు శ్రీకాంత్,ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# యూఏఈ లో సంగారెడ్డి యువకుడి ఘనత



జూన్ 30జనగణమన ప్రతినిదిసంగారెడ్డి టౌన్ లోని బైపాస్ రోడ్ ప్రాంతానికి చెందిన కెప్టెన్ బ్రామనపల్లి మనోజ్ కుమార్ యునైటెడ్ అరబ్ ఎమీరెట్స్ ప్రతిష్టత్మాక ఎత్తిహిడ్ రైల్ ప్రాజెక్టులో తొలి హై స్పీడ్ సర్వీస్ కు తొలి లోకో పైలెట్ గా బాధ్యతలు నిర్వహిస్తూ అరుదైన మైలురాయిని స్వంతం చేసుకున్నాడు!గంటకు 200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలును విజయవంతంగా నడిపిన తొలి డ్రైవర్ లో ఒకరిగా ఆయన చరిత్ర సృష్టించారు.

# పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా

## 1,20,000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



ఇబ్రహీంపట్నం 30 జనగణమన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా రాయపోల్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు.పల్లపు ఎల్లమ్మకు రూ.60,000, పల్లపు శ్రీనుకు రూ.60,000 చొప్పున మంజూరైన రెండు చెక్కులను వారి కుమారుడు పల్లపు శివకు ఈ రోజు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలోమాజీ జడ్పీటీసీ భూపతి గళ్ళ మహిపాల్ ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, తిరుమలేష్, పాల్గొన్నారు.

# ఆకస్మికంగా రికార్డులు తనిఖీ నిర్వహించిలి

## నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి

## మొక్కలు నాటిన ఐపీఎస్ కమిషనర్ డా. తరుణ్ జోషి




ఇబ్రహీంపట్నం 30 జనగణమన ప్రతినిధిరంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ (ఐపీఎస్) డా. తరుణ్ జోషి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు విధుల్లో క్రమశిక్షణ, ప్రజల పట్ల మర్యాదపూర్వక వైఖరి, ఫిర్యాదుల సత్వర పరిష్కారం, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ తనిఖీల్లో డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఏసీపీ కె.వి.పి. రాజు, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్ఓ మహేందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ జితేందర్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ పనితీరు మరింత మెరుగుపడేలా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటిన కమిషనర్, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# ఎలిమినేడు ఆసుపత్రి లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్

ఇబ్రహీంపట్నం 30 జనగణమన ప్రతినిధిప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎలిమినేడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య మాట్లాడుతూ. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. వచ్చే పేషెంట్లకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, థైరాయిడ్ వ్యాధులకు టాబ్లెట్స్ ఇస్తున్నారు. కానీ స్కానింగ్, ఈసీజీ వంటి పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. 24 గంటల సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తం నమూనాలు తీసుకొని కొండాపూర్ లో టెస్టులు చేసి రెండు, మూడు రోజులకు రిపోర్ట్ లు ఇస్తున్నారు. దీనివల్ల పేషంట్లకు ఇబ్బందిగా ఉంది. కనుక ప్రతి ఆసుపత్రిలో అక్కడే టెస్టులు చేసే విధంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే పేదలకు కుక్క కాటు, పాము కాటుకు వైద్యం అందే విధంగా ప్రభుత్వం చొరవ చూపించాలన్నారు. పల్లె దావఖాన బస్తి దావఖానలకు అదనంగా సిబ్బందిని కేటాయించి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం లేక ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలను నిలువునా దోపిడీ గురిచేస్తూన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటెండర్, హౌస్ కీపింగ్ లేకపోవడంతో నర్స్ లు ఊర్చుకుంటున్నారు. వెంటనే అటెండర్, హౌస్ కీపింగ్ వర్కలను నియమించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం కావడంతో ఆసుపత్రి ఆవరణలో గడ్డి, చెట్లు పెరిగి ఆసుపత్రికి విష సర్పాలు రావడంతో సిబ్బంది, పేషెంట్లు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతి ఆస్పత్రికి సంవత్సరానికి 1,75,000/-రూ. మెంటనెన్స్ కింద హాస్పిటల్ డెవలప్మెంట్ ఫండ్ 5సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేయడానికి నిధులు కేటాయించడం లేదు. ప్రైవేటు, కార్పొరేటర్ ఆసుపత్రులలో ఫీజులను నియంత్రించాలి. వెంటనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు హాస్పిటల్ డెవలప్మెంట్ ఫండ్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గణేష్, ప్రభుదాస్, మల్లేష్, ఇందిరా, విజయ, విగ్నేష్, దాసు, శ్రీకాంత్, భూదేవి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బలాహన్‌పూర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

## - సీపీఐ డిమాండ్



తాండూర్, జూన్ 30, జనగణమన ప్రతినిధిమంచిర్యాల జిల్లా తాండూర్ మండలం బలాహన్‌పూర్ గ్రామంలో వెంటనే ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ మాట్లాడుతూ, గ్రామంలోని గిరిజన, ఆదివాసీ, పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో ఆరు కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. విద్యాహక్కు చట్టం--2009 ప్రకారం నిర్ణీత దూరంలో పాఠశాల ఉండాల్సి ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.పాఠశాలలు లేకపోవడం వల్ల చిన్నారులు చదువుకు దూరమై బాల కార్మికులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి బలాహన్‌పూర్ గ్రామానికి ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరాల ప్రహ్లాద్, కొండు సాయికుమార్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల సేవలకు ఘన వీడ్కోలు

మంచిర్యాల, జూన్ 30,జనగణమన ప్రతినిధిమూడు దశాబ్దాలకు పైగా ప్రజా భద్రత కోసం విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు.అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ పదవీ విరమణ పొందిన ఎస్ఐలు ఠాకూర్ సహదేవ్ సింగ్, మహమ్మద్ అహ్మదుల్లా, మేకల మహేందర్ రెడ్డి, ఏఎస్ఐలు బోయ శ్రీనివాస్, మహమ్మద్ అమానుల్లా, ఏఆర్ ఎస్ఐ పి. వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ బొట్ల చేరాలును శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ప్రజల భద్రత కోసం అంకితభావంతో నిర్వర్తించే బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. విధి నిర్వహణలో వారు కనబరిచిన క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం యువ పోలీసులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

## వజ్రేష్ యాదవ్

ఉప్పల్, జూన్ 30 జనగణమన ప్రతినిధి:ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ



(ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి చెర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీ బూత్‌లను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడి ఓటర్ల నమోదు, మార్పులు, ప్రజల స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు లేకుండా, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చెర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతారాం రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నీరజా రెడ్డి, గోపాల్ యాదవ్, వరలక్ష్మి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయినగర్ కాలనీ నూతన కమిటీ సభ్యులను సన్మానించిన దొంతిరిహరిశంకర్ రెడ్డి

మేడిపల్లి, జూన్ 30జనగణమన ప్రతినిధిమల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9వ డివిజన్ మేడిపల్లిలోని శ్రీ సాయినగర్ కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి సన్మానించారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్ చారి, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి,



కోశాధికారిగా నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇబ్రహీం, ఉపాధ్యక్షులుగా సరస్వతి, భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చిరంజీవి, భానుప్రకాష్, ప్రదీప్, మహిళ అధ్యక్షురాలిగా లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సలహాదారులుగా కళావతి, రాజేశ్వరి, లలిత, భారతి, గౌరవ అధ్యక్షులుగా సుదర్శన్ రెడ్డి, సునీల్, హరిందర్ యాదవ్, యాదగిరి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన హరిశంకర్ రెడ్డి, కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య

షాబాద్ జనగణమన ప్రతినిధి షాబాద్ మండల్ మన్మరి గ్రామంలో ప్రభుత్వ బడులు రోజురోజుకు కొత్త కలను సంతరించుకుంటున్నాయి. ప్రైవేట్ బడులకు దీటుగా మన్మరి ప్రభుత్వ బడులు నడపాలని దృఢ సంకల్పంతో ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. రోజురోజుకు గ్రామస్తుల్లో కూడా తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడులపై నమ్మకం కరిగిపోవడం విశేషం. దీనికి ముఖ్య కారణం ఉపాధ్యాయులు గ్రామంలో తిరిగి పిల్లల తల్లిదండ్రులకు నమ్మకం కల్పించడమే. ఈ సంవత్సరం మన్మరి ప్రైమరీ పాఠశాలలో 25కు పైగా కొత్త అడ్మిషన్లు రావడం. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మర్పల్లి అశోక్ మౌర్య మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే అత్యంత విలువైన సంపదనీ,సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య అత్యవసరమని అన్నారు.ఇటీవల పాఠశాలలు పున: ప్రారంభం అయిన తర్వాత ప్రాథమిక పాఠశాల మన్మరిలో నూతనంగా 25మంది విద్యార్థులు అడ్మిషన్ కావడంతో పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 55 కు పెరిగిందని హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుదల విద్యా రంగంలో ఒక సానుకూల పరిణామమణి, విద్యార్థుల సంఖ్య పెరగడానికి కారణాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, పరిశుభ్రమైన మరుగుదొడ్లు,శుభ్రమైన తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన పథకం,ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు,ఉచిత ఏకరూప దుస్తులు వంటి అనేక సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయని అన్నారు . ప్రైవేటు పాఠశాల నుండి విద్యార్థులు ప్రభుత్వ బడులలో చేరడానికి ముఖ్య కారణం వృత్తిపరమైన ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించడం,విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిపై శ్రద్ధ చూపడం వల్ల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని అన్నారు.వేసవికాలంలో ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ పాలకవర్గం,గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి



విద్యార్థుల తల్లిదండ్రులను కలవడం, విద్య ప్రాముఖ్యతను వివరించడం,పాఠశాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా విద్యార్థులు పెరుగుతున్నారని అన్నారు.విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను పాఠశాలల్లో అమలు చేయడం,సమాజ సహకారంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.గ్రామ పంచాయతీ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, పూర్వ విద్యార్థులు, దాతలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాల అభివృద్ధికి సహకరించడంతో,వారి భాగస్వామ్యం వల్ల పాఠశాలపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందనీ తెలియజేశారు.విద్యార్థుల సంఖ్య పెరగడం వల్ల ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠ పెరుగుతుందనీ,సమాన విద్యా అవకాశాలు అందరికీ లభిస్తాయని, సామాజిక సమానత్వంబలపడుతుందనీ,నాణ్యమైన విద్య ద్వారా మంచి పౌరులు తయారై దేశ అభివృద్ధికి తోడ్పడతారనీ వారు వివరించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం ఆనందించదగిన విషయమని,దీనికి సహకరించిన గ్రామ పాలకవర్గం, గ్రామస్తులకు వారు కృతజ్ఞతలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వెంకటమ్మ,శ్రీలత, అనురాధ,చంద్రకళ, శ్యామలమ్మ,మల్లమ్మ, విద్యార్థులు,తదితరులు ఉన్నారు.

# భగత్‌సింగ్ కాలనీలో బోర్‌వెల్ పనులను ప్రారంభించిన మాజీ మేయర్



మేడిపల్లి, జూన్ 30 జనగణమన ప్రతినిధి :మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంపీ లాడ్స్ నిధులతో బోర్‌వెల్ నిర్మాణ పనులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు.కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. సీపీఐ నాయకురాలు లక్ష్మీ మాట్లాడుతూ బోర్‌వెల్ నిర్మాణంతో కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, సీపీఐ నాయకులు మహేశ్వరి, జ్యోతి, బొందయ్య, చంద్రయ్య, నరేష్, మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు నరసింహచారి, యాదగిరి, రామకృష్ణ, పవన్, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్వోకు వినతి



ఉప్పల్, జూన్ 30 జనగణమన ప్రతినిధి:భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మంగళవారం ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జే. వెంకన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, జీవో--12ను రద్దు చేసి సంక్షేమ పథకాలను ప్రభుత్వమే నేరుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.సహజ మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే మంజూరు చేయాలని, 60 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.6 వేల పెన్షన్‌తో పాటు అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సీహెచ్ జంగయ్య, లాలు, కృష్ణ, నరసింహ, రంగనాయకులు, వెంకటేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ వంశీకృష్ణకు సన్మానం

మంచిర్యాల, జూన్ 30, జనగణమన ప్రతినిధి సింగరేణి, కోల్ ఇండియా పరిధిలోని విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని పార్లమెంట్‌లో ప్రస్తావించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంపు, ఆరోగ్య కార్డు పరిమితి పెంపు, గ్రాట్యుటీ బకాయిల చెల్లింపు, బ్యాంకుల్లో ప్రమాద బీమా సౌకర్యాల విస్తరణ వంటి సమస్యలను గతంలో ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో కనీస పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం విశ్రాంత ఉద్యోగులకు ఆశాకిరణంగా మారిందన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యంతో చర్చించి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఆశయ బాటలో జోయమ్మ...



**కృ**ష్ణాజిల్లా దివి తాలూకా చినకళ్లేపల్లిలో గుత్తికొండ కోదండరామయ్య, మాణిక్యమ్మ దంపతులకు జోయ 1940 అక్టోబరు 30న జన్మించారు. ఆమెకు ఏడేళ్లు వచ్చే వరకు పెద్దమ్మ, పెదనాన్నల వద్దే పెరిగారు. ఊహ తెలిసే వయసుకే ఆమె బంధువుల కుటుంబాల్లో రాజకీయ చర్చలు జరుగుతుండేవి. అప్పట్లో బాలల సంఘం సభ్యులతో కలిసి 'భరతమాత పుత్రులం' వంటి దేశభక్తి గీతాలు పాడేవారు. జోయ కూడా వాటిని విని ఆలపించేవారు. ఆమె పెద్దమ్మ సీతమ్మ దేశభక్తి గీతాలను నేర్పేవారు. 1947 ఆగస్టులో దేశానికి స్వాతంత్య్రం వచ్చిన సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో కమ్యూనిస్టు పార్టీ నాయకులతో కలిసి ఆమె కూడా పాల్గొన్నారు.

ఆమె నాయనమ్మ పుట్టిల్లు పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడు. అక్కడ స్త్రీలకు నెలసరి సమయంలో మూడు రోజులు బయట ఉండాలనే ఆచారం అమలు చేసేవారు కాదు. అలాగే దళితులను అంటరానివారిగా చూసే రోజుల్లోనూ ఆ ఇంట్లో అలాంటి వివక్షకు చోటు ఉండేది కాదు. ఆ వాతావరణం కూడా జోయపై గాఢమైన ప్రభావం చూపించింది. దివిసీమ ప్రాంతంలోని పెద్దమ్మ సీతమ్మ ఇల్లు కమ్యూనిస్టు నాయకులకు అజ్ఞాత స్థావరం (డెన్)గా ఉండేది. చల్లపల్లి నారాయణరావు, చలసాని వాసుదేవరావు, దుర్గారావు తదితర నాయకులు అక్కడ రహస్యంగా ఆశ్రయం పొందేవారు. మలబార్ పోలీసులు తరచూ ఇళ్లకు వచ్చి నిర్బంధాలు కొనసాగించడం, ఇంట్లోని పురుషుల గురించి వివరాలు అడుగుతూ కుటుంబ సభ్యులను బెదిరించడం వంటి సంఘటనలు చిన్న వయసులోనే జోయ చూశారు. "పేదలకు జమీందారీ భూములు పంచాలని కోరడమే కమ్యూనిస్టులు చేసిన నేరమా?" అనే ప్రశ్న ఆమె మనసులో బలంగా నాటుకుపోయింది.

లంక భూములు దళితులకు, పేదలకు చెందాలని డిమాండ్ చేస్తూ చినకళ్లేపల్లిలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగేవి. జోయ ఇల్లు పార్టీ కార్యాలయంగా ఉండేది. మహిళలు కోలాటాలు నేర్చుకునేవారు. యువకులు మిలిటరీ బ్యాండ్‌లో శిక్షణ పొందేవారు.


అప్పట్లో గోగినేనిపాలెం చింతలతోపులో కోడిపందాలు నిర్వహించేవారు. యువతను సన్మార్గంలో నడిపేందుకు యువజన సంఘాలు చెడుగుడు తదితర క్రీడా పోటీలు నిర్వహించి చైతన్యం కల్పించేవి. గ్రామంలో కలరా వ్యాపిస్తే మందులు వేయడం, దళితవాడను శుభ్రపరచడం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఉద్యమకారులు పాల్గొనేవారు. ఆ రోజుల్లో చినకళ్లేపల్లి రాజకీయ, సామాజిక చైతన్యానికి కేంద్రంగా నిలిచింది. మహిళలు వరి కోతకు వెళ్లి సంపాదించిన కూలి డబ్బులో కొంత భాగాన్ని కమ్యూనిస్టు పార్టీకి విరాళంగా ఇచ్చేవారు. చదువుకునే రోజుల్లో జోయ తండ్రి ఉద్యమాల్లో పాల్గొనడాన్ని సహించలేని కాంగ్రెస్ సేవాదళ్ వాలంటీర్లు నాటు తుపాకులు చూపించి బెదిరించేవారు.

1959లో ఆమెకు యార్లగడ్డ రామనరసింహంతో వివాహమైంది. పిల్లల చదువుల నిమిత్తం 1972లో విజయవాడ పటమటలో నివాసం ఏర్పరచుకున్నారు. ఆమె పెద్దమ్మ గుత్తికొండ సీతమ్మ పిల్లలను చదివిస్తూ, జోయకు విజయవాడలో అండగా ఉండేవారు. ఆమె కూడా పార్టీలో పనిచేసేవారు. 1977లో దివిసీమ ఉప్పెన సందర్భంగా పార్టీ, మహిళా సంఘాలు సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. జోయ, మానికొండ సూర్యావతి, దండమూడి భిక్షావతి, తులసమ్మలతో కలిసి బట్టలు, ఆహార పదార్థాలు, నగదు సేకరించి కోడూరు వెళ్లి తుపాను బాధిత కుటుంబాలకు అందజేశారు. అప్పటి నుంచే కమ్యూనిస్టు పార్టీతో, మహిళా సంఘంతో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. విజయవాడలో పిల్లలను చదివించుకుంటూనే ఖాళీ సమయంలో మహిళా సంఘంలో చురుగ్గా పనిచేసేవారు. అప్పట్లో పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య వంటి మహానాయకులు తుపాను బాధితుల సేవలో నిమగ్నమై ఉండటాన్ని చూసి ఆమె మరింత స్ఫూర్తిని పొందారు. అనంతరం మోటూరు ఉదయం, మోటూరు హనుమంతరావు వంటి నాయకులతో ఆమెకు సన్నిహిత పరిచయం ఏర్పడింది.

1980లో మహిళా సంఘం రాష్ట్ర రెండో మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. భూస్వామ్య కుటుంబాలకు చెందిన యువత ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలో చేరేందుకు ఆమె విశేషంగా కృషి చేశారు. సీపీఎం నందిగామ డివిజన్ కార్యదర్శిగానూ పనిచేశారు. మహిళలకు సమాన హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. చందర్లపాడులో పాల కేంద్రం ఏర్పాటుకు కృషి చేసి, జిల్లాలోనే ఉత్తమ పాల సొసైటీగా అవార్డు అందుకునేలా చేశారు. 1986లో విజయా పాల కేంద్రం జిల్లా డెయిరీ డైరెక్టర్‌గా ఎన్నికై సమర్థవంతంగా పనిచేశారు. చందర్లపాడులో రేషన్ షాపును నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆమె స్వయంగా బాధ్యతలు చేపట్టి నడిపించారు.

### అనేక ఉద్యమాల్లో ...

సుబాబుల్ కర్రకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సుబాబుల్ రైతుల సంఘం రాష్ట్ర నాయకురాలిగా పనిచేసి పలు రాష్ట్రస్థాయి ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. పలుమార్లు గిట్టుబాటు ధర పెంపు కోసం కృషి చేశారు. వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఉద్యమాల్లో ఆమె సమరశీలంగా పోరాడారు. 1990 ప్రాంతంలో నెల్లూరు జిల్లా దూబగుంటలో రోశమ్మ ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమంలో నందిగామ ప్రాంతంలో జోయ, చావా నాగసూర్యామణి, చదల జానకిరామయ్య, వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి చురుగ్గా పాల్గొన్నారు. 2005లో వీరులపాడు మండలం జుజ్జూరు సెంటర్‌లో బ్రాందీ షాపు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించి దానిని వేరే చోటుకు మార్పించడంలో కీలకపాత్ర పోషించారు. జోయ, కాట్రగడ్డ స్వరూపరాణి, పిన్నమనేని విజయ, చాంద్‌బేగం తదితరులు బ్రాందీ షాపు ముందు ధర్నా నిర్వహించి, మద్యం సీసాలు పగులగొట్టి దానిని మూయించారు. గుంటూరు బాపనయ్య, పాటూరు రామయ్య ఎమ్మెల్యేలుగా గెలుపొందేందుకు ఆమె తనవంతుగా దివి ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘం ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో మోటూరు ఉదయం, సూర్యావతి, నాగళ్ల రాజేశ్వరమ్మ, భిక్షావతి తదితర నాయకులతో కలిసి పనిచేశారు. చెవుటూరు కాల్వ తవ్వకం కోసం చేపట్టిన ఉద్యమంలో మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సభ్యురాలిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉద్యమాల్లో, పార్టీలో సీనియరుగా ఉన్నా, ఏ బాధ్యతల్లో ఉన్నాఒక సాధారణ కార్యకర్తగానే నిరాడంబరంగా మెలిగేవారు. పార్టీ నాయకత్వంతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ ఉద్యమాలకు అంకితభావంతో పనిచేశారు. జోయ ఎందరో కార్యకర్తలను అమ్మలా ఆదరించారు. ప్రజలందరికీ అన్ని హక్కులూ, అన్ని సదుపాయాలూ సమకూరాలని జీవితాంతం పరితపించారు. సమ సమాజం ఏర్పడాలనే తపనకు, ఆచరణకు ఆమె జీవితం ఒక నిదర్శనం, మార్గదర్శకం.



పిల్లలతో జోయ, రామనరసింహం దంపతులు

# పిల్లలకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలను ఎక్కువగా తాగిస్తే ప్రమాదం.. పెద్దయ్యాక వారికి హైబీపీ వస్తుంది..

చిన్నప్పటి నుంచి పిల్లలు తాగే పానీయాలు వారి భవిష్యత్తు ఆరోగ్యంపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని తాజా పరిశోధన వెల్లడించింది. ముఖ్యంగా చక్కెర ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, స్పోర్ట్స్ డ్రింక్స్, ప్యాకెట్ ఫ్రూట్ జ్యూస్‌లను తరచూ తాగే పిల్లల్లో పెద్దయ్యాక అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన పానీయాల అలవాట్లు పెంపొందించడం గుండె ఆరోగ్యానికి ఎంతో కీలకమని వారు సూచిస్తున్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ సర్క్యులేషన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో 25 వేల మందికి పైగా వ్యక్తుల ఆరోగ్య సమాచారాన్ని సుమారు 25 సంవత్సరాల పాటు పరిశీలించారు. చిన్ననాటి నుంచి యుక్తవయస్సు వరకు వారు తీసుకున్న చక్కెర పానీయాలు, ఫ్రూట్ జ్యూస్, తాజా పండ్ల వినియోగాన్ని విశ్లేషించి, పెద్దయ్యాక వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.



**అలాంటి వారికి ముప్పు ఎక్కువ..**

రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు చక్కెర కలిగిన పానీయాలు తాగిన పిల్లకు, వారానికి మూడు సార్ల కంటే తక్కువగా తాగిన వారితో పోలిస్తే భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 52 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. రోజుకు ఒక్కసారి శీతల పానీయం తాగిన వారిలో కూడా ఈ ప్రమాదం 23 శాతం పెరిగింది. అలాగే స్పోర్ట్స్ డ్రింక్స్‌ను తరచూ తీసుకున్న వారిలో ఈ ప్రమాదం 36 శాతం అధికంగా నమోదైంది. చాలా మంది తల్లిదండ్రులు ఫ్రూట్ జ్యూస్‌లను శీతల పానీయాలకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు. అయితే రోజుకు ఒకటిన్నర సర్వింగ్ లేదా అంతకంటే ఎక్కువ ఫ్రూట్ జ్యూస్ తాగిన పిల్లల్లో కూడా భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 35 శాతం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వంద శాతం పండ్ల రసంలో విటమిన్లు, ఖనిజాలు ఉన్నప్పటికీ, అందులో పీచు పదార్థం ఉండదు. పీచు లేకపోవడంతో చక్కెర వేగంగా రక్తంలో కలిసి రక్తనాళాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వారు వివరించారు.

**ఇతర అనారోగ్య సమస్యలు కూడా..**

చక్కెర పానీయాల్లో ముఖ్యంగా ఫ్రక్టోజ్ వంటి చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల బరువు పెరగడం, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, శరీరంలో వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ గుండె, రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని పెంచి అధిక రక్తపోటుకు దారితీసే అవకాశాన్ని పెంచుతాయి. అయితే మొత్తం ఫ్రక్టోజ్ పరిమాణం కంటే అది ఏ ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తుందనేదే ముఖ్యమని అధ్యయనం సూచించింది. పండ్లలో ఉండే ఫ్రక్టోజ్ మాత్రం అధిక రక్తపోటు ప్రమాదాన్ని పెంచలేదని పరిశోధకులు గుర్తించారు. దీనికి కారణం పండ్లలో ఉండే పీచు, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు రక్షణాత్మక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

**తాజా పండ్లు మేలు..**పిల్లలు ప్రతిరోజూ తాగే ఒక చక్కెర పానీయాన్ని తాజా పండ్లతో భర్తీ చేస్తే భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 22 శాతం వరకు తగ్గే అవకాశం ఉంటుందని అధ్యయనం తెలిపింది. అలాగే చక్కెర పానీయాల స్థానంలో నీరు లేదా పాలు తీసుకోవడం కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఇది ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండానే అభివృద్ధి చెందుతుంది. నియంత్రించకపోతే గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

# అల్లంతో హై బీపీకి చెక్




ఆహారంలో వినియోగించే అల్లం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. హైబీపీని నియంత్రించడంలో ఇది చక్కగా సాయపడుతుందన్నారు. అలాగే అనేక అనారోగ్య సమస్యలను కూడా తగ్గిస్తుంది.

**అల్లం వాడడం వల్ల..**

అల్లంలో అనేక జీవక్రియశీల సమ్మేళనాలు(దీఱశ్రీఞ్ఱఅజవ ఏశీఎజూశీబఅంం) ఉంటాయి. ఇవి హైబీపీని సాధారణ స్థితికి తీసుకురావడానికి దోహదపడతాయి. అల్లంలో జింజెరోల్, షాగావోల్ తదితర సమ్మేళనాలు ఉంటాయి. అదే విధంగా వీటిలో యాంటీఆక్సిడెంట్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉ ంటాయి. ఇవి హైబీపీని నియంత్రించడంలో సహాయపడతాయి. అల్లం తినడం వల్ల రక్తనాళాలు సాధారణ స్థితికి వస్తాయి. తద్వారా శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడటం సహా హైబీపీ సమస్యను తగ్గిస్తుంది.

**ఇతర వ్యాధులకు చెక్..**

అల్లంలో వాపు నిరోధక గుణాలు ఉంటాయి. ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా వాపును తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అల్లం తీసుకోవడం వల్ల శరీరంలోని హానికరమైన విష పదార్థాలతోపాటు వ్యర్థాలనూ తొలగిస్తాయి. కీళ్లు, కండరాలలో నొప్పి ఉంటే.. అల్లం తీసుకోవడం వల్ల ఇట్టే తగ్గిపోతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే జలుబు, దగ్గును తగ్గించడంలో అల్లం ప్రభావవంతంగా పని చేస్తుంది. అల్లంను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంచుకోవడం సహా వైరల్, సీజనల్ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. **గమనిక:** ఈ కథనం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న నివేదికలు, సమాచారం ఆధారంగా రూపొందించబడింది.




# క్లాసిక్ సినిమా లెగసీని కాపాడుతున్న సూపర్ స్టార్!



ఒకప్పుడు సీక్వెల్ అంటే ఇప్పటికే హిట్ అయిన కథను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే అనుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఒకప్పుడు సీక్వెల్ అంటే ఇప్పటికే హిట్ అయిన కథను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే అనుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ముఖ్యంగా కోలీవుడ్ లో సూపర్ హిట్ సినిమాలకు సీక్వెల్స్ రూపొందించడం ఓ ట్రెండ్ గా మారింది. ప్రేక్షకుల్లో ఉన్న నాస్టాల్జియాను, బ్రాండ్ వాల్యూను క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశంతో పలువురు డైరెక్టర్లు, నిర్మాతలు సీక్వెల్స్‌పై దృష్టి పెడుతున్నారు. అయితే ఈ ట్రెండ్ మధ్య కూడా సూపర్ స్టార్ రజనీకాంత్ మాత్రం ఒక క్లాసిక్ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులేస్తున్నట్టు తెలుస్తోంది. రజనీకాంత్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన పడయప్ప (తెలుగులో నరసింహ) సినిమా ఇప్పటికీ తమిళ సినీ చరిత్రలో అత్యంత ప్రభావం చూపిన కమర్షియల్ క్లాసిక్స్‌లో ఒకటిగా గుర్తింపు పొందింది. హీరో క్యారెక్టరైజేషన్, ఎమోషన్స్, కుటుంబ కథనం, మాస్ ఎలివేషన్స్, డైలాగ్స్, మ్యూజిక్, విలన్ క్యారెక్టర్.. ఇలా ప్రతి అంశం ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. అందుకే ఈ సినిమాకు సీక్వెల్ అంటే అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడటం సహజం. ఇటీవల డైరెక్టర్ కె.ఎస్. రవికుమార్‌తో కలిసి ఈ సినిమాకు సీక్వెల్ పై డిస్కషన్స్ జరిపినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే కథ ఆలోచన ప్రారంభ దశలో ఆసక్తికరంగా అనిపించినప్పటికీ, పూర్తి స్థాయి స్క్రిప్ట్ మాత్రం ఆ క్లాసిక్‌కు తగ్గ స్థాయిలో లేదనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం ఆ ఆలోచనను ముందుకు తీసుకెళ్లకుండా వేచి చూడాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఇండస్ట్రీ టాక్ వినిపిస్తోంది. ఇదే నిర్ణయం రజనీకాంత్ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక సినిమా బ్రాండ్ వాల్యూ ఉందనే కారణంతో దానికి సీక్వెల్ రూపొందించడం కంటే, ప్రేక్షకులు ఆశించే స్థాయిలో బలమైన కథ దొరికినప్పుడే ముందుకు వెళ్లాలనే దృక్పథాన్ని ఆయన అనుసరిస్తున్నట్లు డిస్కషన్ జరుగుతోంది. గత కొన్నేళ్లుగా తమిళంలో అనేక సీక్వెల్స్ తెరకెక్కుతున్నప్పటికీ, వాటిలో అన్నీ ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ముఖ్యంగా క్లాసిక్ సినిమాలకు సీక్వెల్స్ తీసుకురావడం ఎంత పెద్ద సవాలో ఇటీవల వచ్చిన కొన్ని సినిమాలు మరోసారి గుర్తు చేశాయి.

# రాజకీయాల్లోకి సూర్య.. కాకపుట్టించిన అభిమాని ప్రసంగం!

ఈ మాటలు సూర్య రాజకీయాల్లోకి రావడానికి సిద్ధపడుతున్నారనే సంకేతంగా నెటిజన్లు భావించడంతో గందరగోళం ఏర్పడింది. తమిళ రాజకీయాల్లో సినీ నటుల అరంగేట్రం పాత విషయమే అయినా? దళపతి విజయ్ రాజకీయాల్లోకి అడుగు పెట్టడం... పోటీ చేసిన తొలిసారే ముఖ్యమంత్రి అవ్వడం అన్నది అతి పెద్ద చరిత్రే. ప్రస్తుతం ముఖ్యంత్రిగా అతడి పనితీరుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. అభ్యుదయ భావజాలతో గొప్ప పరిపాలన అందిస్తున్నారనేది మేధా వర్గం అభిప్రాయం. ఐదేళ్ల పాలన ఇదే రకంగా కొనసాగితే? విజయ్ స్పీడ్ ను ఇప్పట్లో ఎవరూ ఆపలేరు అన్నది అంతే వాస్తవంగా తెరపైకి వస్తోంది. ఇండస్ట్రీ నుంచి విజయ్ కు పూర్తి స్థాయిలో మద్దతు ఉంది. విజయ్ తరం హీరోలంతా అతడికి ఎంతగానో మద్దతిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సూర్య రాజకీయాల్లోకి రాబోతున్నారా? అనే చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది.



ఇటీవల ఓ అభిమాని చేసిన వ్యాఖ్యలు ఈ ప్రచారానికి ఆజ్యం పోసాయి. దీనిపై సూర్య అభిమాన సంఘం అప్రమత్తమై అధికారికంగా స్పందించాల్సి వచ్చింది. రాజకీయాల్లోకి సూర్య ప్రవేశంపై ఊహాగానాలు మొదలవ్వడానికి ప్రధాన కారణం ఆర్. వీరమణి అనే అభిమాని చేసిన ప్రసంగం. ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, -కాలం నిర్ణయిస్తే, దేవుడు నిర్ణయిస్తే, ఒక వ్యక్తిని ప్రజా నాయకుడిగా మారకుండా ఎవరూ ఆపలేరు- అని సూర్య గురించి వ్యాఖ్యానించారు. ఈ మాటలు సూర్య రాజకీయాల్లోకి రావడానికి సిద్ధపడుతున్నారనే సంకేతంగా నెటిజన్లు భావించడంతో గందరగోళం ఏర్పడింది. ఈ ప్రచారంపై స్పందించిన ఆల్ ఇండియా సూర్య ఫ్యాన్స్ క్లబ్ వీరమణి వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని స్పష్టం చేసింది. వీరమణి వ్యాఖ్యలను చేసిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తోన్న తీరును క్లబ్ తప్పుబట్టింది. వీరమణి గత మూడేళ్లుగా తమ క్లబ్ పరిపాలనా విభాగంలో లేరని ఆయన మాటలకు సంస్థతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. సూర్యకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఏమాత్రం లేదని క్లబ్ స్పష్టం చేసింది.అగరం ఫౌండేషన్ ద్వారా విద్య, సామాజిక సేవ కార్యక్రమాలతోనే సూర్య ప్రజలకు సేవ చేస్తున్నారని ఆ పనులే ఆయనకు పూర్తి సంతృప్తిని ఇస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. దీనిపై సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో విజయ్ రాజకీయ ప్రయాణం గురించి మళ్లీ చర్చకొచ్చింది. ఫ్యాన్ క్లబ్‌లు కేవలం సినిమా ప్రమోషన్లకే కాకుండా ప్రజల కోసం పనిచేసే సంస్థలుగా ఎలా మారతాయో? వివరించారు. చాలా ఏళ్ల క్రితమే విజయ్ అభిమాన సంఘం అనేక సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలోనే విజయ్ లాగే సూర్య కూడా ఫ్యాన్ క్లబ్‌ను రాజకీయాలకు వాడుకుంటారా? అన్న సందేహం చాలామందిలో కలిగింది. దీనిపై సూర్య అభిమాన సంఘం మాత్రం సరైన స్పష్టతనివ్వలేదు. ప్రస్తుతం సూర్య వెంకీ అట్లూరి దర్శకత్వంలో -విశ్వనాథ్ అండ్ సన్స్- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సూర్య కొత్త ప్రాజెక్ట్ కు సంబంధించి చర్చల్లో బిజీగానూ ఉన్నారు.

# సింపుల్ పింక్, రాయల్ స్టైల్... కాజల్ లుక్‌కు ఫ్యాన్స్ ఫిదా!





తాజాగా ఆమె షేర్ చేసిన ఒక ఫొటో షూట్ ఇంటర్నెట్‌లో తెగ హల్‌చల్ చేస్తోంది. ఎంతో ప్రశాంతంగా, రాయల్ లుక్‌లో కనిపిస్తూ తన సహజ సిద్ధమైన అందంతో అభిమానులను కట్టిపడేశారు.టాలీవుడ్ అందాల చందమామ కాజల్ అగర్వాల్ ఎవర్ గ్రీన్ బ్యూటీ అని మరోసారి నిరూపించుకున్నారు. పెళ్లయి, ఒక బాబు పుట్టినా కూడా ఆమె గ్లామర్ ఏమాత్రం తగ్గలేదు. తాజాగా ఆమె షేర్ చేసిన ఒక ఫొటో షూట్ ఇంటర్నెట్‌లో తెగ హల్‌చల్ చేస్తోంది. ఎంతో ప్రశాంతంగా, రాయల్ లుక్‌లో కనిపిస్తూ తన సహజ సిద్ధమైన అందంతో అభిమానులను కట్టిపడేశారు. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదే జోష్ చూపిస్తూ, లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్స్‌తో కుర్రకారు గుండెల్లో మళ్లీ గుబులు రేపుతున్నారు. పింక్ కలర్ డ్రెస్‌లో చందమామ మెరుపులు: ఈ లేటెస్ట్ ఫొటో షూట్‌లో కాజల్ అగర్వాల్ లైట్ పింక్ కలర్ ప్లీటెడ్ పెప్లమ్ టాప్, దానికి మ్యాచింగ్ మ్యాక్సీ స్కర్ట్ వేసుకున్నారు. 'ప్లీట్స్ బై అరుణి', 'వైరల్ మంత్ర' బ్రాండ్స్ డిజైన్ చేసిన ఈ వెస్టన్ కమ్ ట్రెడిషనల్ డ్రెస్ కాజల్‌కు పర్ఫెక్ట్‌గా సూట్ అయ్యింది. ఇక ఆమె చిరునవ్వు, ఆ డ్రెస్ కలర్ కాంబినేషన్ చూసి ఫ్యాన్స్ లవ్ ఎమోజీలతో సోషల్ మీడియాను ముంచెత్తుతున్నారు. మేకప్, స్టైలింగ్ నెక్స్ట్ లెవెల్: సెలబ్రిటీ స్టైలిస్ట్ అర్చా మెహతా ఈ లుక్‌ని ఎంతో అద్భుతంగా ప్లాన్ చేశారు. జుట్టుకు చిన్న చిన్న పూల యాక్సెసరీస్ పెట్టి, చాలా సింపుల్ జ్యువెలరీతో కాజల్‌ని అలంకరించారు. ఇక విశాల్ చరణ్ లైట్ అండ్ ఫ్రెష్ మేకప్ చేయగా, శివాని హెయిర్ స్టైల్ అదరగొట్టారు. ఫొటోగ్రాఫర్ కునాల్ రాథోడ్ తన కెమెరాతో కాజల్ అందాలను ఎంతో అందంగా బంధించారు. మగధీర నుండి నేటి వరకు అదే క్రేజ్: దాదాపు 15 ఏళ్లకు పైగా ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్న కాజల్, 'మగధీర' సినిమాతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిపోయారు. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేశారు. ఇక పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ ఇచ్చినా, ఇప్పుడు మళ్లీ వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఆమె క్రేజ్ మరియు గ్లామర్ ఇప్పటికీ అస్సలు తగ్గలేదు. భారీ చిత్రాలతో బిజీగా సెకండ్ ఇన్నింగ్స్: ప్రస్తుతం కాజల్ చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో ఒకటి పాన్ ఇండియా మూవీ 'ది ఇండియా స్టోరీ'. సామాజిక ఇతివృత్తంతో వస్తున్న ఈ సినిమా వచ్చే నెల జూలై 24న రిలీజ్ కానుంది. ఇక దీంతో పాటు నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోతున్న »NBK111' సినిమాలో కూడా కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇక ఇవే కాక నితీష్ తివారీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక 'రామాయణం' చిత్రంలో మండోదరి పాత్రలో నటిస్తున్నారు. సినిమాల ప్రమోషన్లలో భాగంగా కాజల్ అగర్వాల్ చేస్తున్న ఈ ఫొటో షూట్లు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎంతమంది కొత్త హీరోయిన్లు వచ్చినా 'చందమామ' స్టైలే వేరు అని ఈ పింక్ లుక్‌తో ఆమె మరోసారి ప్రూవ్ చేశారు.

# 'రామాయణ' ట్రైలర్ డేట్ లాక్? 100 రోజుల ముందే ప్లానింగ్!?




ప్రస్తుతం ఇండియన్ సినిమా నుంచి రాబోతున్న గ్లోబల్ లెవెల్ సినిమాల్లో దర్శకుడు నితీష్ తివారి, రణబీర్ కపూర్ అలాగే యష్ ఇంకా సాయి పల్లవి లాంటి అగ్ర తారాగణంగా వస్తున్న సినిమా రామాయణ కూడా ఒకటి. భారతీయ సినిమా నుంచి మొదట ఐమాక్స్ సినిమాగా దీనిని ప్రెజెంట్ చేస్తూ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం వహిస్తున్నారు.అయితే విజువల్స్ పరంగా కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ కంటెంట్ మాత్రం పెద్దగా వదలకుండానే నెట్టుకు వస్తున్నారు. ఇక ఇదిలా ఉండగా గత కొన్నాళ్ల కితమే సినిమా ట్రైలర్ కి సంబంధించి అప్డేట్ ఒకటి అందించాము. ట్రైలర్ ఈ జూలై లోనే ఉంటుంది అని టాక్ వచ్చింది. అయితే లేటెస్ట్ బజ్ ప్రకారం ఈ 100 రోజులు ముందే జూలై 14న మేకర్స్ లాస్ ఏంజిల్స్ లో విడుదల చేస్తున్నట్టు స్ట్రాంగ్ రూమర్స్ వినిపిస్తున్నాయి.

# విజయ్ ప్లేస్ లో లారెన్స్ పోటీ.. బిగ్ క్లారిటీ ఇచ్చేసిన కాంచన హీరో





మల్టీ టాలెంటెడ్ పర్సనాలిటీ రాఘవ లారెన్స్ ఆ మధ్య రాజకీయ ప్రవేశంపై కీలక నిర్ణయం తీసుకుంటున్నట్లు అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. తను రావాలా వద్దా అనేది అభిమానులుకి వదిలేసాడు రాఘవ లారెన్స్. అయితే తమిళ స్టార్ నటుడు ఇప్పుడు సీఎం విజయ్ పోటీ చేసిన రెండు స్థానాల్లో తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్టు వచ్చిన అనేక రూమర్స్ లో భాగంగా లారెన్స్ ప్రకటన ఇవ్వడం జరిగింది.అయితే ఇప్పుడు విజయ్ తప్పుకున్న స్థానం నుంచి తను పోటీ చేయబోవడం లేదని తను క్లారిటీ ఇచ్చేసాడు. అలాగని రాజకీయాల్లోకి రావట్లేదు అని కూడా చెప్పలేదు. ప్రస్తుతం తన ఫోకస్ అంతా సినిమాల మీద ఉందని వాటిని పూర్తి చేస్తానని కానీ తన సేవ మాత్రం ఆగదని కాంచన హీరో, దర్శకుడు క్లారిటీ ఇచ్చారు. దీనితో ఈ అనౌన్స్మెంట్ మాత్రం ఫ్యాన్స్ కి ఒకింత డిజప్పాయింట్మెంట్ ని మిగిల్చింది అని చెప్పొచ్చు. ప్రస్తుతం లారెన్స్ బెంజ్, కాంచన 4 తదితర సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే.

# బంగారం తర్వాత సామ్ 'ట్రలాలా' ప్లాన్ ఏంటి?



ఆ బ్యానర్ నుంచి ఇకపై ఎలాంటి సినిమాలు రాబోతున్నాయి? కొత్త దర్శకులకు అవకాశాలిస్తారా? లేక మా ఇంటి బంగారం సీక్వెల్ పైనే దృష్టి పెడతారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఒక సినిమా విజయం సాధిస్తే తర్వాత హీరో లేదా డైరెక్టర్ నెక్స్ట్ ప్రాజెక్టుపై ఆసక్తి పెరగడం సహజం. కానీ మా ఇంటి బంగారం బ్లాక్ బస్టర్ తర్వాత ఇప్పుడు అందరి దృష్టి సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పై పడింది. ఆ బ్యానర్ నుంచి ఇకపై ఎలాంటి సినిమాలు రాబోతున్నాయి? కొత్త దర్శకులకు అవకాశాలిస్తారా? లేక మా ఇంటి బంగారం సీక్వెల్ పైనే దృష్టి పెడతారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. సమంత ప్రముఖ నిర్మాతలు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వురులతో కలిసి ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ ను స్టార్ట్ చేశారు. కొత్త తరహా కథలు ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో ఆ నిర్మాణ సంస్థను ప్రారంభించారు. తక్కువ సమయంలోనే ఆ బ్యానర్ తనదైన గుర్తింపు తెచ్చుకోవడం విశేషం. ఆ సంస్థ నుంచి వచ్చిన తొలి చిత్రం శుభం. 2025లో విడుదలైన సినిమాకు ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన సినిమాలో సమంత క్యామియో రోల్ లో కనిపించారు. నిర్మాతగా మాత్రమే వ్యవహరించి కొత్త టాలెంట్ ను ప్రోత్సహించారు. ఆ తర్వాత వచ్చిన మా ఇంటి బంగారం మాత్రం ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ కు పెద్ద విజయాన్ని అందించింది. సమంత లీడ్ రోల్ లో నటించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించిన ఆ చిత్రం జూన్ 19వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. బీవీ నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమాలో గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి కీలక పాత్రల్లో నటించారు. ట్రెడిషనల్ ఫ్యామిలీలో జీవించే ఓ గృహిణి తన గతం నుంచి వచ్చిన ప్రమాదం నుంచి కుటుంబాన్ని ఎలా కాపాడుకుందనే కథతో రూపొందినఆ చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. విడుదలైన పది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.78.71 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది.ఆ విజయంతో ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై అంచనాలు మరింత పెరిగాయి. ఆ సినిమా సక్సెస్ మీట్ లో నిర్మాత రాజ్ నిడిమోరు మరో కీలక ప్రకటన చేశారు. మా ఇంటి బంగారం మూవీకి సీక్వెల్ తప్పకుండా ఉంటుందని చెప్పారు. అయితే రెండో భాగం వెంటనే రాదని, దాదాపు రెండేళ్ల తర్వాత ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే సీక్వెల్ కు ఇంకా సమయం ఉండటంతో ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ నెక్స్ట్ ప్లాన్ పై ఆసక్తి నెలకొంది. సమంత, రాజ్ నిడిమోరు కలిసి పలువురు యువ దర్శకులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

Printed, Published and Owned by Kothinti Devender Reddy, Published at 14-20-677/482, VVN Nagar, Madhapur, Hyderabad, Telangana- 500 033. Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, H.No.11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal-Malkajgiri District - 500098. **Editor : Kothinti Devender Reddy**. PRGI REGD NO.TGTEL/26/A1335. Mail ID: janaganamanadaily@gmail.com, Ph:040-29701155